# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 223 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 02 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 223 02-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-









## ఏపీలో ప్రతినెలా..

# పెన్షన్ పండుగే...

- పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు తెచ్చాం
- తుగ్లక్ పాలన పోయింది-ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది
- నవంబర్ 4వ తేదీన ఆటో డ్రైవర్ సేవలో పథకానికి శ్రీకారం చుడతాం
- కరెంటు చార్జీలు పెంచం-చార్జీలు తగ్గించే దిశగా చర్యలు చేపడతాం
- ప్రపంచస్థాయి కంపెనీలకు కేంద్రంగా విశాఖను తయారుచేస్తాం
- రూ. 2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- విజయనగరం జిల్లా దత్తి ప్రజా వేదికలో సీఎం చంద్రబాబు
- పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా పింఛన్లు పంపిణీ చేసిన సీఎం

**గజపతినగరం, దత్తి, అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఒకటో తేదీన పింఛన్ల పంపిణీతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పండుగను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా బుధవారం విజయనగరం జిల్లా గజపతి నియోజకవర్గం దత్తి గ్రామంలో సీఎం పర్యటించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్లు అందించారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పొంతూరు అప్పలరాజుకు, ఆయన తల్లికి పింఛను అందజేశారు. అనంతరం ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు పండుగ చేసుకోవాలన్నా ఇబ్బందిగా ఉండేదని ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ప్రతి నెలా పండుగ వస్తోందని సీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత నేటితో కలిపి 16 నెలల్లో రూ.48,019 కోట్లు పింఛన్లపై ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం మనదే. రాష్ట్రవ్యాప్తంగా 50,765 మందికి రూ.2,745 కోట్లు పింఛన్లు కింద పంపిణీ చేస్తున్నాం. వృద్ధాప్య పింఛనుదారు చనిపోతే అతని భార్యకువెంటనే వితంతు పింఛన్ మంజూరు చేస్తున్నాం. ఈ నెలలో కొత్తగా 10,578 మందికి రూ.4.23 కోట్లు వితంతు పింఛన్లు ఇస్తున్నాం. 2 నెలలు పెన్షన్ తీసుకోని 1,34,023 మందికి రూ.108 కోట్లు, 3 నెలలుగా పింఛన్లు తీసుకోని 11,545 మందికి రూ.14 కోట్లు విడుదల చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పేదలకు న్యాయం చేయడమే ధ్యేయం**

గత ప్రభుత్వంలో ఒకటి రెండు నెలలు పింఛను తీసుకోకపోతే కట్ చేసేవాళ్లని, ప్రజా ప్రభుత్వంలో పేదలకు న్యాయం చేయాలనే ఏకైక ధ్యేయంతో రెండు నెలలు పింఛను తీసుకోకపోయినా మూడో నెల ఇస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడికి వెళ్లి పింఛను అందిస్తున్నాం. ఒక్క విజయనగరం జిల్లాలోనే ప్రతీ నెలా 2,75,682 మందికి రూ.117 కోట్లు పింఛన్లు రూపంలో ఇస్తున్నాం. గజపతినగరం నియోజకవర్గంలో 39,641 మందికి రూ.17 కోట్లు అందిస్తున్నాం. దత్తి గ్రామంలో 706 మందికి నెలకు రూ.29 లక్షలు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నాం. ఎన్టీఆర్ 1985లో రూ. 30తో పింఛను పథకాన్ని

- తరువాయి 2లో..








## వ్యక్తిత్వ వికాసంతోనే..

# దేశ నిర్మాణం..

**ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ**
**వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే సంస్థ అని కొనియాడిన ప్రధాని**
**'నేను' నుంచి 'మనం' వైపు నడిపించే స్ఫూర్తిదాయక సంస్థగా అభివర్ణన**
**సంఘ్ పై ఎన్నో కుట్రలు జరిగినా ఎదుర్కొని నిలబడిందని వ్యాఖ్య**
**వ్యక్తిత్వ నిర్మాణానికి శాఖలు పవిత్ర వేదికలని కితాబు**

**న్యూఢిల్లీ అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది కేవలం ఒక సంస్థ కాదని, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే ఒక మహోన్నత శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'నేను' అనే అహాన్ని వీడి 'మనం' అనే సామూహిక భావన వైపు నడిపించే స్ఫూర్తిదాయక ప్రయాణమే సంఘ్ అని ఆయన అభివర్ణించారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో బుధవారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కు ఎన్నో అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ, వాటన్నింటి లక్ష్యం ఒకటేనని, అదే 'జాతికే ప్రథమ స్థానం' అని స్పష్టం



- తరువాయి 2లో..

## విలీన మండలాల్లో

# వరద బీభత్సం..

**వంద గ్రామాలకు తెగిన సంబంధాలు**
**విలీన మండలాల్లో వరద బీభత్సం.. శబరి, గోదావరి పోటు**
**అల్లూరి జిల్లాను ముంచెత్తిన వరద.. భద్రాచలానికి నిలిచిన రాకపోకలు**
**ప్రమాదకర స్థాయిలో గోదావరి.. నీట మునిగిన ఏజెన్సీ గ్రామాలు**



**రాజమహేంద్రవరం అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విలీన మండలాలను వరదలు ముంచెత్తుతున్నాయి. గోదావరి, దాని ఉపనది శబరి ఉగ్రరూపం దాల్చడంతో ఏజెన్సీ ప్రాంతం అతలాకుతలమవుతోంది. వరదనీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో దాదాపు వంద గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. అధికారులు


- తరువాయి 2లో..

## డిసెంబర్‌లో భారత్ పర్యటనకు రానున్న

# రష్యా అధ్యక్షుడు పుతిన్

**శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుడిసెంబర్‌లో భారత్ పర్యటనకు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్**
**శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు రానున్న పుతిన్**
**అమెరికా అధిక సుంకాలు విధిస్తున్న నేపథ్యంలో పుతిన్ రాకకు ప్రాధాన్యత**
**గత ఏడాది రెండుసార్లు సమావేశమైన మోదీ, పుతిన్**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ డిసెంబర్ నెలలో భారత్ పర్యటనకు రానున్నారు. ప్రతి సంవత్సరం జరిగే శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు డిసెంబర్ 5-6 తేదీల్లో ఆయన భారత్‌కు విచ్చేయనున్నారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్న కారణంగా భారత్‌పై అమెరికా అధిక సుంకాలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పుతిన్ రాక ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్‌లో పుతిన్ పర్యటన ఉంటుందని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈ ఆగస్టులో మాస్కో పర్యటన సందర్భంగా ప్రకటించారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ కూడా పర్యటన ఉంటుందని గత వారం ధ్రువీకరించినప్పటికీ, తేదీలను వెల్లడించలేదు. డిసెంబర్ 5, 6 తేదీల్లో పర్యటన ఉంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రధాన మంత్రి



- తరువాయి 2లో..

## చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనకు

# ముహూర్తం ఖరారు



**అమరావతి అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనకు ముహూర్తం ఖరారు అయింది. అక్టోబర్ 22 నుంచి 24వ తేదీ వరకు దుబాయ్, అబుదాబి, యూఏఈలలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా పార్టనర్ షిప్ సమ్మిట్ -2025 జరగనుంది. ఈ సమ్మిట్‌కు విదేశీ పెట్టుబడుదారులను ఆహ్వానించేందుకు ఆయా దేశాల్లో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. రియల్ ఎస్టేట్స్, భవన నిర్మాణం, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో పెట్టుబడులను సీఎం చంద్రబాబు ఆహ్వానించనున్నారు. అలాగే రవాణా, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్నోవేషన్స్ రంగాల్లో సైతం పెట్టుబడుదారులకు ఆయన స్వాగతం పలకనున్నారు. ఈ విదేశీ పర్యటనకు సీఎం చంద్రబాబు వెంట మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డిలతోపాటు పరిశ్రమలు, పెట్టుబడులు, ఏపీఐఐసీ విభాగాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు చేస్తున్న ఈ విదేశీ పర్యటనకు జీఏడీ పొలిటికల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా బుధవారం అనుమతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.



# వైభవంగా శ్రీవారి రథోత్సవం

**తిరుమల అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన బుధవారం ఉదయం 7 నుండి 9 గంటల వరకు శ్రీమలయప్పస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో యాత్రికులు పాల్గొని రథాన్ని లాగారు. బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్టింపజేసి ఆలయ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ అనిల్ కుమార్ సింఘాల్, పలువురు బోర్డు సభ్యులు, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ మురళి కృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో**

శ్రీ మలయప్పస్వామిని రాత్రి ఏడు గంటలకు అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో ఉంచి వాహనసేవ ప్రారంభించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బందాలు భజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి.

**చక్రస్నానం ఏర్పాట్లను తనిఖీ చేసిన టిటిడి ఇఒ**

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన అక్టోబర్ 2వ తేదీ జరగనున్న చక్రస్నానం సందర్భంగా శ్రీవారి పుష్కరిణిలో టిటిడి ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ తనిఖీలు నిర్వహించారు. పుష్కరిణి ప్రాంతంలోని నలువైపులా జెఇఒ వి.వీరబ్రహ్మం, జిల్లా ఎస్‌పి ఎల్.సుబ్బరాయుడు, సివిఎస్‌ఒ కె.వి.మురళీకృష్ణలతో కలిసి బుధవారం పరిశీలించారు. ఇఒ మాట్లాడుతూ యాత్రికులు పుష్కరిణిలోకి ప్రవేశించేందుకు, తిరిగి వెలుపలికి వెళ్లేందుకు వీలుగా గేట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిటిడి అధికారులు, విజిలెన్స్, పోలీసులు సమిష్టిగా సమన్వయం చేసుకుని పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ఉదయం ఆరు గంటల నుండి తొమ్మిది గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులకు, చక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం, చక్రస్నానం నిర్వహిస్తామని తెలిపారు. చక్రస్నానం సందర్భంగా 1,000 మంది

- తరువాయి 2లో..

# సంపాదకీయం

## అన్నింటిపైనా సుంకాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంలోకి దిగుమతయ్యే ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌పై వంద శాతం సుంకాలు బాది ప్రపంచ ఔషధ మార్కెట్‌ను అనిశ్చితిలోకి నెట్టారు. కొత్త సుంకాలు అక్టోబర్ ఒకటి (నేడు) నుంచి అమల్లోకొస్తాయని ట్రంప్ ప్రకటించారు. కేవలం బ్రాండెడ్, పేటెంట్ ఔషధాల పైనే వంద శాతం సుంకాలని పైకి చెబుతున్నా అమల్లోకొస్తేనే వాస్తవం బోధ పడుతుంది. తమ వాణిజ్య భాగస్వాములపై జాతీయంగా విధించిన సుంకాలకు కొత్తవి అదనమా కాదా అన్నదానిపై స్పష్టత లేదు. సుంకాలపై చట్టపరంగా వివరించలేదు. అమెరికాలో ఔషధ ఉత్పత్తి ప్లాంట్లు స్థాపించిన, నెలకొల్పే దశలో ఉన్న వారికి సుంకాల నుంచి మినహాయింపునిచ్చారు. దేశీయంగా తయారీని పెంచి, తద్వారా బడ్జెట్ లోటును పూడ్చుకునేందుకే సుంకాలంటూ ఆగస్టు నుంచి ట్రంప్ చెలరేగిపోతున్నారు. ఆ వాదనలో ఎంతమాత్రం నిజం లేదని ఎవరైనా చెబుతారు. దేశ భద్రత, ఇతర కారణాల రీత్యానే సుంకాలు వేస్తున్నామనడం ఎంతమాత్రం పొసగదు. తన మాట వినని దేశాలపై కక్ష సాధించడానికే సుంకాల బాదుడు. పైగా ఏకపక్షంగా వేస్తున్నారు. వాణిజ్యపర, ద్వైపాక్షిక చర్చలకు ఆస్కారం లేకుండా, గిట్టని దేశాలను ఎంపిక చేసుకొని మరీ సుంకాల విధింపునకు బరి తెగించారు.

ప్రస్తుతం ఔషధ దిగుమతులపై ట్రంప్ విధించిన సుంకాల వలన ఇప్పటికిప్పుడు భారత్ ఫార్మా పరిశ్రమపై ప్రభావం ఉండదని, అందుక్కారణం మన దేశం జనరిక్ మందుల ఎగుమతిదారుగానే ఉందదన్నది ఇండిస్టీ పెద్దల ప్రాథమిక అంచనా. భవిష్యత్తులో సుంకాలు జనరిక్‌నకు కూడా విస్తరించే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే మన దేశ ఫార్మా ఇండిస్టీకి పెద్ద దెబ్బే. ఇప్పుడు కూడా ఫార్మా స్టాక్స్‌పై సెంటిమెంటల్ ప్రభావం కచ్చితంగా ఉంటుందనేవారు లేకపోలేదు. అమెరికా ఔషధ అవసరాలలో 40 శాతం మేర భారతదేశం తీరుస్తోంది. 2024లో ఆ దేశానికి దిగుమతైన ఫార్మా డ్రగ్స్ విలువ 27.9 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 2.45 లక్షల కోట్లు) కాగా వాటిలో 31 శాతం, అంటే 8.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 77 వేల కోట్లు) భారత్‌వే. అమెరికాలో వినియోగించే జనరిక్ ఔషధాల్లో 45 శాతం మన దేశం నుంచే సరఫరా అవుతున్నాయి. ఇండియాలో ప్రముఖ ఫార్మా కంపెనీలైన డాక్టర్ రెడ్డీస్, అరబిందో, జైడస్, సన్, గ్లాండ్ వంటి సంస్థల ఆదాయాల్లో 30-50 శాతం వరకు అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నాయి. ఈ విధంగా చూస్తే భారత్‌ను దెబ్బతీయాలన్న ప్రధాన లక్ష్యంతోనే ట్రంప్ వంద శాతం సుంకాలు వేశారని అర్థమవుతుంది. అందుకే తమ దేశంలో మందుల ధరలు పెరిగినా పట్టించుకోలేదు.

తన ఆంక్షలను ధిక్కరించి ఇండియా, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కక్షతో ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారు. తాజాగా ఫార్మాతో పాటు గృహోపకరణాలు, చివరికి సినిమా పరిశ్రమను సైతం వదిలిపెట్టలేదు. భారత్‌ను ఇబ్బందులు పెట్టి, బెదిరించి తన దారికి తెచ్చుకోవాలని చూస్తున్నారు. హెచ్1 బి వీసాల వ్యవహారం కూడా ఆ కోవలోనిదే. ఇప్పటికే ట్రంప్ టారిఫ్‌ల వలన మన వ్యవసాయ, ఆక్వా తదితర రంగాలు, రైతులు సంక్షోభంలో పడ్డాయి. అయినప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా-ట్రంప్ విధానాలను, వినాశకర నిర్ణయాలను గట్టిగా నిలదీసి, నిరసించడంలో, పోరాటం నిర్వహించడంలో తటపటాయిస్తోంది. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల సదర్భంగా బ్రిక్స్ దేశాలు ట్రంప్ టారిఫ్‌లను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాయి. ఆ సంయుక్త ప్రకటనలో ఇండియా కూడా ఉంది. ప్రకటనలు ఏ విధంగా ఉన్నా అమెరికాతో జరిగే వాణిజ్య, ద్వైపాక్షిక సమావేశాల్లో, అంతర్జాతీయ వేదికలపైనా ట్రంప్ ఏకపక్ష, కక్ష పూరిత టారిఫ్‌లను భారత్ వ్యతిరేకించాలి. ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకించే మిగతా దేశాలతో కలిసి నిర్వహించే పోరాటంలో భారత్ ముందుండాలి. అదే దేశ ప్రజల ప్రయోజనాలకు రక్ష. అమెరికా-ట్రంప్‌తో పెనవేసుకుంటే మన ప్రయోజనాలకు గండికొట్టి దేశాన్ని తాకట్టు పెట్టినట్లు భావించాలి. మూల్యం చెల్లించుకోక తప్పదు.

## ఏపీలో ప్రతీ నెలా పెన్షన్ పండుగే

ప్రారంభించారు. నేను 1995లో ముఖ్యమంత్రి అయినప్పుడు దాన్ని రూ. 75 చేశాను. 2014లో రూ. 1000 , ఆపై 2000 వేలకు పెంచానని ముఖ్యమంత్రి అన్నారు.

**దేశంలో అధిక పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఏపీనే**

మనదేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛను ఇవ్వడంలేదని ముఖ్యమంత్రి అన్నారు. పింఛన్ల పంపిణీ బాధ్యతగా చేపట్టాం. మానవత్వంలో ఆలోచిస్తున్నాం. రూ. 4,000 నుంచి రూ. 15,000 వరకు పెన్షన్లు ఇస్తున్నాం. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రతి నెలా ఒక జిల్లాకు వచ్చి స్వయంగా పింఛను పంపిణీ చేస్తున్నాను. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రం కూడా పెన్షన్ల కోసం ఏడాదికి ఖర్చు చేస్తుంది కేవలం రూ. 5,160 కోట్లుమాత్రమే. తెలంగాణలో ఏడాదికి రూ. 8,179 కోట్లు ఇస్తుంటే మన రాష్ట్రంలో ఏడాదికి రూ. 32,143 కోట్లు ఖర్చు చేస్తున్నాం. నెలనెలా పెన్షన్ తీసుకుంటున్న వారిలో 59 శాతం మంది మహిళలు ఉన్నారు. ఇప్పటి వరకు పింఛన్ల కోసం 16 నెలల్లో ఖర్చు చేసిన రూ. 48,019 కోట్లలో రూ. 28,331 కోట్లు మహిళలకు ఇస్తున్నందుకు సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు.

### మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశాం

సూపర్ సిక్స్ పథకాల అమల్లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశామని ముఖ్యమంత్రీ చంద్రబాబు తెలిపారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేస్తున్నాం. ఇందుకోసం రూ. 10,090 కోట్లు ... 63.77 లక్షల మంది విద్యార్థుల తల్లులకు బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశాం. ఆడబిడ్డలకు వంటింటి కష్టాలు తీర్చాలని దీపం పథకాన్ని అమలు చేస్తున్నాం. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. పథకం వల్ల ఏడాదిలో కోటికి పైగా కుటుంబాలు ప్రయోజనం పొందాయి. 2.66 కోట్ల సిలిండర్లు సబ్సిడీపై అందించాం. దీనికి రూ. 1,718 కోట్లు ఖర్చు పెట్టాం. స్త్రీ శక్తి పథకాన్ని ఆగస్ట్ 15న ప్రారంభిస్తే 45 రోజుల్లోనే దగ్గర దగ్గరగా మహిళలు10 కోట్ల ప్రయాణాలు చేయడం నాకు ఆనందంగా ఉంది. ఈ పండుగ సీజన్ లో అన్ని దేవాలయాల్లో మహిళా భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. పథకం అమల్లో భాగంగా నెలకు రూ. 247 కోట్లు, ఏడాదికి రూ. 2,963 కోట్లు స్త్రీ శక్తి కోసం ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

### అక్టోబర్ 4న ఆటో డ్రైవర్ల సేవలో

డ్రైవర్ల కష్టాలు నాకు తెలుసు కాబట్టే వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు పథకం తెస్తున్నామని సీఎం అన్నారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు ఆదాయం తగ్గకుండా ఉండేందుకు ఈ నెల 4న ఆటో డ్రైవర్ సేవలో పథకానికి శ్రీకారం చుడుతున్నాం. ఒక్కో ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ. 15,000 ఆర్థిక సాయం ఇస్తాం. దాదాపు 2.90 లక్షల మంది ఆటోడ్రైవర్లు ఈ పథకానికి అర్హులుగా గుర్తించాం. ఈ పథకం అమలుకు ఏడాదికి రూ. 435 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి ఒక్కో రైతుకూ రూ. 20,000 ఇస్తున్నాం. సూపర్ సిక్స్ లో మొదటి హామీ మెగా డీఎస్సీ . ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టే అధికారంలోకి రాగానే మొదటి సంతకం పెట్టి ఏడాదికే టీచరు పోస్టులు ఇచ్చాం. 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి యువతకు నేను అండగా ఉంటాను. వివిధ ప్రభుత్వ విభాగాల్లో 9,093 మందిని, పోలీస్ శాఖలో 6,100 ఉద్యోగాలు భర్తీ చేశాం. వర్క్ ఫ్రమ్ హోమ్ కింద ఇప్పటికే 5,500 మందికి ఉపాధి కలుగుతోంది. ఈ 15 నెలల్లో ఇప్పటివరకు మొత్తం 4,71,574 మందికి ఉద్యోగాలు దక్కేలా చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

### 2029 నాటికి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఇల్లు

2029 నాటికల్లా రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ ఇల్లు కట్టించే బాధ్యత తనదని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, వచ్చే ఏడాది జూన్ కల్లా మరో 6 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అందరి ఆకలి తీర్చేలా 204 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయి. యూనివర్సల్ హెల్త్ పాలసీ త్వరలో తీసుకువస్తున్నాం. పేదలు, ధనికులు తేడా లేకుండా అందరికీ రూ. 2.5 లక్షలు మేర ఆరోగ్య బీమా అందిస్తాం. దీంతో రాష్ట్రంలోని 1.63 కుటుంబాలకు ఆరోగ్య భద్రత లభిస్తుంది. పేదలకు రూ 25 లక్షల వరకూ ఉచితంగానే వైద్యం అందిస్తాం. సూపర్ జీఎస్టీ వల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపయోగపడేలా ధరలు తగ్గి కొనుగోలు శక్తి పెరిగింది. జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం దాదాపు రూ. 8 వేల కోట్లు తగ్గుతుంది. దీన్ని స్వాగతిస్తూ మనం శాసన సభలో తీర్మానం చేశాం. కారణం... పేద, మధ్యతరగతి ప్రజలకు రూ. 8 వేల కోట్ల మేర ప్రయోజనం కలుగుతుంది అనేది మా ఆలోచన. కొత్త శ్లాబుల వల్ల ప్రతి కుటుంబానికి... ప్రతినెలా రూ. 1000 -1500 వరకు ఆదా అవుతుందని సీఎం అన్నారు.

### భవిష్యత్ లో కరెంటు చార్జీలు పెంచబోం

ఎన్డీఏ ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గించే చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. సమర్ధ నిర్వహణతో విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టాం. గత ప్రభుత్వంలో 9 సార్లు కరెంటు రేట్లు పెంచి రూ. 32 వేల కోట్ల భారం ప్రజలపై వేశారు. దేశ చరిత్రలో తొలి సారి ట్రూడౌన్ తో విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తున్నాం. నవంబర్ 13 నుంచి ట్రూ అప్ చార్జీలు యూనిట్ కు 13 పైసలు తగ్గుతాయి. పిఎం కుసుమ్ స్కీంల భాగంగా రైతులకు, పిఎం సూర్యఘర్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. బీసీలకు గరిష్టంగా రూ. 98 వేలు సబ్సిడీ ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

### ఉత్తరాంధ్ర అభివృద్ధి బాధ్యత నాది

ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కావాలనే ఉద్దేశంతోనే భోగాపురం ఎయిర్ పోర్టు ఇక్కడ నిర్మిస్తున్నాం. గత పాలకుల వల్ల భోగాపురం ఎయిర్ పోర్టు ఆలస్యమైంది. 2026 ఆగస్టు నాటికి భోగాపురం ప్రారంభిస్తాం. విజయనగరం పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లా. వంశధార, నాగావళి, తోటపల్లి , తారకరామ, తీర్థసాగర్ సహా అనేక ప్రాజెక్టులు మేమే ప్రారంభించాం. రాబోయే రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ. 2 వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేసి గోదావరి నుంచి వంశధారకు అనుసంధానం చేయడం వల్ల నీటి ఎద్దడి తీరుతుంది. . రూ. 25 కోట్లు వ్యయంతో సార్వగడ్డ మినీ రిజర్వాయర్ రెండేళ్లలోగా పూర్తిచేసి నీరు అందిస్తాం. మత్స్యకారులకు జెట్టీ కట్టిస్తాం. శాసనాపల్లి సమీపంలో హై లెవల్ బ్రిడ్జ మంజూరు చేస్తాం. మర్రివలస నుంచి గజపతి నగరం వరకూ నూతన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తాం. అటు విశాఖ నగరానికి టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీకి సమీపంలోనే ట్రైబల్ యూనివర్సిటీ కూడా నిర్మాణమవుతోంది. రూ. కోటీ 47 లక్షలతో ఆర్సెఆర్ మిథల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. విశాఖ, రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవేతో దేశమంతటా రవాణాకు కనెక్టివిటీ మెరుగవుతుందని%వ% ముఖ్యమంత్రి తెలిపారు.

### తుగ్లక్ పాలన ముగిసింది

గతంలో పాలకులు వస్తున్నారంటే పరదాలు కట్టేవారని, వచ్చినవాళ్లు వెళ్లకుండా గోతులు తవ్వేవారని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా ఉండే పరిస్థితులు లేవు. 2024లో ప్రజలకు స్వేచ్ఛ ,స్వాతంత్ర్యం వచ్చింది. కొన్ని పార్టీలకు మంచి పనులు చేయడం రాదు. ఇతరులు చేస్తే తట్టుకోలేరు. అడుగడుగునా అడ్డుకునే కుట్రలు చేస్తారు. తప్పుడు వార్తలు ప్రచురిస్తారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తారు. అలాంటి వారి ఆటలు సాగవు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే అదే వారికి చివరిరోజవుతుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

### శ్రీవారి ఆశీస్సులతో ముందుకు

నాపై 24 క్లైమోర్ మైన్స్ పేల్చితే... సాక్షాత్తు ఆ వెంకటేశ్వర స్వామియే నాకు ప్రాణభిక్ష పెట్టాడు. ఆ స్వామి ఆశీస్సులతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తాను. ఆనాడు ఎన్టీఆర్ తిరుమలలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత టీటీడీ ఆధ్వర్యంలో నడిచే అన్ని దేవాలయాల్లోనూ అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రాణదానం ట్రస్ట్ కింద రూ. 688 కోట్ల నిధులను సమీకరించి తిరుపతిలో ఉండే ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తాం. రాష్ట్రంలో 17 లక్షల శ్రీవారి సేవకులు ఉన్నారు. బ్రహ్మోత్సవాలు%వ% విజయవంతంగా జరుగుతున్నాయంటే అందులో సేవకుల కృషి కూడా ఉంది. విదేశాల్లో ఉంటున్న మన తెలుగు డాక్టర్లు ఓ వారం రోజులు తిరుపతిలో పేదలకు వైద్యం చేసి శ్రీవారి దర్శనం చేసుకోమని నేను పిలుపునిచ్చాను. దేశవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మిస్తున్నాం. అలాగే మసీదులు, చర్చిలు కట్టుకోవడానికి ప్రభుత్వపరంగా నిధులు మంజూరు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## వ్యక్తిత్వ వికాసంతోనే.. దేశ నిర్మాణం..

చేశారు. ఏ రెండు అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని ఆయన పేర్కొన్నారు. సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణం అనే బలమైన సంకల్పాన్ని తీసుకున్నారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత పెరిగినప్పుడే దేశం బలోపేతం అవుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. అందుకే వ్యక్తి వికాసానికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. నేటికీ సంఘ్ శాఖల్లో ఈ వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ కనిపిస్తుందని, ఇవి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడే పవిత్ర వేదికలని ప్రధాని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో డాక్టర్ హెడ్గేవార్ సహా ఎందరో సంఘ్ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని మోదీ గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా సంఘ్ పై అనేక దాడులు, కుట్రలు జరిగాయని ఆయన అన్నారు. సంస్థను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని, కానీ వాటన్నింటినీ సంఘ్ ఎదుర్కొని నిలబడిందని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా స్వయంసేవకులు ఎన్నడూ ద్వేషానికి ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## విలీన మండలాల్లో వరద బీభత్సం..

సహాయక చర్యలను ముమ్మరం చేశారు. గోదావరి నది నీటిమట్టం కూనవరం వద్ద 47.75 అడుగులకు చేరి ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోంది. దీంతో పలు ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరింది. ముఖ్యంగా కూనవరం మండలం పోలిపాక, దూగుట్ట వద్ద రోడ్లు నీట మునగడంతో చింతూరు %-% కూనవరం మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అదేవిధంగా, ఎటపాక మండలం నందిగామ, నెల్లిపాక ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద చేరడంతో విలీన మండలాల నుంచి భద్రాచలానికి వెళ్లే మార్గం మూసుకుపోయింది. వరద ప్రభావంతో అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వీఆర్ పురం మండలంలోని శ్రీరామగిరి, వడ్డిగూడెం, చింతరేవుపల్లి గ్రామాలు పూర్తిగా నీటితో నిండిపోయాయి. కూనవరంలోని భాస్కర కాలనీ, గిన్నెల బజార్‌లోని ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే పనులను అధికారులు చేపట్టారు. పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్న అంచనాతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. శబరి, గోదావరి నదుల ఉధృతితో వందకు పైగా గిరిజన గ్రామాలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాయి.

## డిసెంబర్‌లో భారత్ పర్యటనకు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

నరేంద్ర మోదీ, పుతిన్‌లు గత ఏడాది రెండుసార్లు సమావేశమయ్యారు. జులైలో జరిగిన శిఖరాగ్ర సదస్సులో భాగంగా మోదీ రష్యాకు వెళ్లారు. అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో మరోసారి వీరిద్దరు సమావేశమయ్యారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ పుతిన్-మోదీ భేటీ అయ్యారు.

## వైభవంగా శ్రీవారి రథోత్సవం

పోలీసులు, 1300 మంది టిటిడి విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో, ఎన్.డి.ఆర్.ఎఫ్, ఫైర్, తదితర విభాగాల నుండి 140 మందితో పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పుష్కరిణిలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఈతగాళ్లను, బోటును అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. చక్రస్నానాన్ని యాత్రికులు వీక్షించేందుకు వీలుగా ఆలయ పరిసరాల్లో ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు.

## రాజమహేంద్రవరం-తిరుపతి విమాన సర్వీసు ప్రారంభం

### ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు





**న్యూఢిల్లీ అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాజమహేంద్రవరం నుంచి తిరుపతికి విమాన సర్వీసును పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్ నుంచి ఎంపీ పురందేశ్వరితో కలిసి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ దేవీ నవరాత్రుల్లో తిరుపతికి విమాన సర్వీసులు ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. టికెట్ ధర మొదటి 35 సీట్లకు రూ. 1999, తర్వాత 35 సీట్లకు రూ. 4000 మూడు నెలలపాటు అందుబాటులో ఉంటుందన్నారు. ఢిల్లీ, ముంబయికి ప్రారంభించిన విమాన సర్వీసులు నిండుగా నడుస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో షిర్డీ, వారణాసి, కొచ్చి తదితర ప్రాంతాలకు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ తిరుపతికి విమాన సర్వీసును ప్రారంభించుకోవడం శుభపరిణామమని చెప్పారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సర్వీసులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ ఈ విమాన సర్వీసులను నడపనుంది. దీని ద్వారా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వాసులకు ఆకాశయానం ద్వారా ఆధ్యాత్మిక యాత్ర దగ్గరకానుంది. రెండో తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం ఈ సర్వీసు అందుబాటులోకి రానుంది. మంగళ, గురు, శనివారాల్లో అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ దీన్ని నడపనుంది.

### బాలయోగి జీవితం ఎన్నో తరాలకు ఆదర్శం: రామ్మోహన్ నాయుడు

దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా రామ్మోహన్‌నాయుడు నివాళులర్పించారు. పాత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్‌లో బాలయోగి చిత్రపటం వద్ద ఆయన అంజలి ఘటించారు. బాలయోగి జీవితం ఎన్నో తరాలకు ఆదర్శమని చెప్పారు. కోనసీమ గడ్డ నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో లోక్‌సభ స్పీకర్‌గా ఆయన పనిచేసి తెలుగువారి కీర్తిని ఎల్లలు దాటించారన్నారు. ఆయన సేవలు దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సానా సతీశ్, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ రేట్లు యథాతథంగా ఉంచిన ఆర్‌బీఐ




ముంబయి: ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించింది. రెపోరేట్‌ను మరోసారి యథాతథంగా ఉంచింది. విశ్లేషకుల అంచనాలకు భిన్నంగా వరుసగా రెండోసారి రెపోరేట్‌ను 5.5 శాతం వద్దే కొనసాగించింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో 0.25 శాతం చొప్పున కీలక రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. అలా మూడు వరుస సమీక్షల్లో కలిపి రెపోరేట్ 1% తగ్గింది. ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టులో మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచింది. కాగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి వినియోగదారుల ధరల ఆధారిత సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 4 శాతం లేదా అంతకంటే తక్కువ స్థాయిలో ఉండవచ్చని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది.





# చంద్రబాబు ప్రజావేదిక చిత్రమాలిక














విజయనగరం జిల్లా, గజపతినగరం నియోజకవర్గం, దత్తి గ్రామంలో
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి
స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు.





తెలుగురాష్ట్రం
దినపత్రిక

# సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

## -ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శిరీష దేవి



**రంపచోడవరం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** సంక్షేమం, అభివృద్ధిని సమజోడిగా నడిపిస్తున్న ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వం అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎం. శిరీష దేవి అన్నారు. బుధవారం ఆమె ఎన్టీఆర్ సామజిక ఫింఛన్లు పంపిణీ కార్యక్రమం నియోజక వర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్ సౌజన్యంలో నిర్వహించారు. రంపచోడవరం మండలంలోని గాంధీనగరం, దోకులపాడు, మారేడుమిల్లి మండలంలోని దేవరపల్లి, సున్నంపాడు గ్రామాల్లో ఎన్టీఆర్ సామాజిక ఫింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధిని సామాజిక బాధ్యతగా ముందుకు నడిపిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి చెల్లిందన్నారు. అలాగే ప్రతీ నెలా సామాజిక ఫింఛన్లు అందుతున్న విధానాలుపై లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తమను సంప్రదించాలని కోరారు.ఆయా గ్రామాల్లో ఫించను దారులకు ఫించన్ సొమ్ములు అందజేసి వారి యోగక్షేమాలు నేరుగా అడిగి తెలుసుకున్నారు అలాగే ఆయా గ్రామాల్లో కొన్ని మౌళిక వసతుల కొరకు పలు వినతులు రాగ వెంటనే సంభదిత అధికారులకు సూచనలు జారీ చేసి త్వరితగతిన ఆయా పనులు పూర్తి చేయాలని వాటి పురోభివృద్ధి తమకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస యాదవ్, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూ రమేష్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ జి. సునీత, మండలంపార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, మారేడుమిల్లి మండలం పార్టీ అధ్యక్షులు గురుకు శేషు కుమార్ సీతపల్లి బాపనమ్మ తల్లి గుడి డైరెక్టర్ సిద్దా వెంకన్నదొర, మాజీ సర్పంచ్ నిరంజనీదేవి, సీనియర్ నాయకులు అడబాల బాపిరాజు, పండా బాబీ, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

# సి హెచ్ సి లో రక్తదాన శిబిరం



**చింతూరు, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేకరి):** సామాజిక బాధ్యత, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతను ప్రశంసనీయంగా ప్రదర్శిస్తూ, 42వ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సి ఆర్ పి ఎఫ్) బెటాలియన్ స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద చింతూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్ సి)లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సి ఆర్ పి ఎఫ్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు. ప్రాణాలను రక్షించే కార్యక్రమానికి దోహదపడ్డారు. స్థానిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు మద్దతు ఇచ్చారు. మారుమూల ప్రాంతాలలో పెరుగుతున్న రక్త డిమాండ్‌ను పరిష్కరించడం, అత్యవసర, క్లిష్టమైన సంరక్షణ అవసరాలకు తగిన లభ్యతను నిర్ధారించడం ఈ క్యాంప్ నిర్వహించారు.సి హెచ్ సి చింతూరు వైద్య సిబ్బంది, సి ఆర్ పి ఎఫ్ అధికారుల సహకారంతో, అన్ని ప్రామాణిక వైద్య ప్రోటోకాల్‌లను అనుసరించి ఈ శిబిరాన్ని నిర్వహించారు. సేకరించిన రక్త యూనిట్లను అత్యవసర అవసరం ఉన్న రోగులకు, ముఖ్యంగా ఈ ప్రాంతంలోని గిరిజన మరియు పేద వర్గాలకు చెందిన వారికి ప్రయోజనం చేకూర్చడానికి ఉపయోగిస్తారని తెలియజేశారు.సి ఆర్ పి ఎఫ్ సిబ్బంది ఒకరు మాట్లాడుతూ "భద్రత పరంగా మాత్రమే కాకుండా ఆరోగ్యం మరియు సామాజిక సంక్షేమ కార్యకలాపాల ద్వారా కూడా సమాజానికి సేవ చేయడానికి మా నిరంతర ప్రయత్నంలో ఈ చొరవ ఒక భాగం. అటువంటి గొప్ప కారణానికి తోడ్పడటానికి మేము గర్విస్తున్నామని అన్నారు.డా ఎంవి కోటిరెడ్డి సూపరింటెండెంట్, వైద్య అధికారులు సి ఆర్ పి ఎఫ్ యొక్క మానవతా ప్రయత్నాలను అభినందించారు. సిబ్బంది వారి దాతృత్వం మరియు ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం వి కోటిరెడ్డి సూపరింటెండెంట్, డా స్పందన, సి ఆర్ పి ఫ్ సిబ్బంది కె ప్రజ్ కుమార్, పి నిరంజన్ డాకువా, డి రాహుల్ అశోక్ రావు, కె అజయ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాలినడకన వెళ్లే భవానీ భక్తులకు బిక్ష

## -నందమూరు గ్రామస్తుల ఔదార్యం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేకరి):** కాలి నడకన విజయవాడలోని అమ్మవారి ఆలయానికి వెళుతున్న భవానీ భక్తులకు అల్పాహారంతో పాటు భిక్ష అందిస్తూ తమ ఔదార్యాన్ని చాటుకుంటున్నారు మండలంలోని నందమూరు గ్రామస్తులు. దసరా పర్వదినాల్లో భవానీ మాలధారణ భక్తులు నిడదవోలు నుంచి దుర్గమ్మ గుడికి ఏటా వందల మంది కాలినడకన వెళ్తుంటారు. వారి కోసం ఏదొకటి చేయాలని గ్రామానికి చెందిన శనగన రాంబాబు, శ్రీనివాసుల పురుషోత్తమాచార్యులు, ,కుంట్ల వీర వెంకట రమణ, మామిడి శంకరం, ఈరుల్ల పోతురాజు (నాని) బృందం సంకల్పించింది. దీనిలిబాగంగా విజయవాడ కొండకు నడిచి వెళ్తున్న భక్తులకు నాలుగు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం అల్పాహారం మధ్యాహ్నం బిక్ష, పాలు అందజేస్తున్నారు. భవానీలు బిక్షను సంతృప్తిగా ఆరగించి, కొంత సేపు అక్కడే సేద తీరి తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా బృదం సభ్యులు మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో భవానీ మాలధారణకు ఓ ప్రత్యేకత ఉందని, దీక్ష పూర్తయ్యేవరకు అమ్మవారిని ఎంతో నిష్ఠతో పూజించాల్సి ఉంటుంది. భవానీలకు గతేడాది నుంచి నాణ్యమైన అల్పాహారం, బిక్ష అందజేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోను ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. వీరిని గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.


# ఏరియా ఆసుపత్రిలో నూతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేకరి):** అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో విలువైనదని, రక్త నిధిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన బ్లడ్ బ్యాంకు ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాలను కాపాడేందుకు సరైన సమయానికి రక్తం అందక ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రక్తం తయారు చేయలేనిదని, రక్తం సేకరణ ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. ఆసుపత్రికి వేలాదిమంది పేదలు ప్రతిరోజు వైద్యం నిమిత్తం వస్తారని, అవసరమైన వారికి రక్తాన్ని ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గతంలో ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లేని కారణంగా బయట నుండి తీసుకొచ్చి వినియోగించాల్సి ఉండేదని, దీని వలన కాలయాపన కూడా జరిగేదని తెలిపారు. రక్తాన్ని అందించేందుకు దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఇది రెండవ బ్లడ్ బ్యాంక్ అని, ఏరియా ఆసుపత్రికి సొంతంగా బ్లడ్ బ్యాంకు ను సమకూర్చుకోవడం చాలా సంతోషించదగిన విషయమని తెలిపారు. నేషనల్ హైవే పరిధిలో ప్రమాదాలకు గురైన సందర్భంలో అత్యవసరంగా రక్తం అవసరం అవుతుందని, ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆ సమస్య తీరుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడే సూత్రధారులు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా రక్తదానం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ప్రభుత్వ విప్, శాసన సభ్యులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంపు ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై వారు ఆరా తీశారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సను, మందులను అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్యం నుంచి తమని తాము కాపాడుకోవచ్చుని వివరించారు. ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటుచేసిన పౌష్టికాహార వస్తువుల ప్రదర్శనను వారు తిలకించారు. తల్లి, బిడ్డలకు బాలామృతాన్ని సక్రమంగా అందజేయడంతో పాటు, పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గర్భవతులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.చివరిగా రాష్ట్రీయ పోషణ మాసం - 2025 సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్, డిఎంహెచ్ఓ, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సెల్ఫీ దిగి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ ఇంచార్జ్ ఈతకోట తాతాజీ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఎం హెచ్ ఓ డాక్టర్ జి.గీతా బాయి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, ఐసిడిఎస్ పి.డి డి.శ్రీలక్ష్మి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.రవిపాల్, సిడిపిఓ టి.ఎల్ సరస్వతి, స్థానిక జె.ఎస్.పి నాయకుడు వర్తనపల్లి కాశీ, టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, సుబ్బరాజు, శ్రీను, రఘు తదితరులు పాల్గొన్నారు.




# అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి-టీ కే విశ్వేశ్వర రెడ్డి



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 1(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** దేవీ నవరాత్రుల సందర్భంగా రాజమండ్రి దేవి చౌక్ లోని దేవి గుడి దగ్గర మురళి ఈవెంట్స్ వారిచే ఏర్పాటు చేయబడిన ఆర్కెస్ట్రాను తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టీకే విశ్వేశ్వరరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీకే మాట్లాడుతూ మురళి ఈవెంట్స్ అధినేత మురళి ఆర్కెస్ట్రా ఎంతో కష్టపడి రాజమండ్రి సిటీలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నాడని భవిష్యత్తులో అమ్మవారి దయవల్ల మరింత అభివృద్ధి చెందాలని కొనియాడారు. అనంతరం ఎడిషనల్ ఎస్పీ మురళీకృష్ణతో కలిసి దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవిచౌక్ అమ్మవారి కమిటీ వారు ఎడిషనల్ ఎస్.పి మురళి కృష్ణని, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టీకే విశ్వేశ్వర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానే ఉమాదేవి, మురళీ, గుడి కమిటీ వారు శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మినీ అంగన్వాడి భవనం, సచివాలయ భవనాన్ని పునరుద్దించాలి

## -ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతి



**ఎటపాక, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేఖరి):** లక్ష్మీపురం గ్రామంలో సమస్యల మీద చింతూరు ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటీడీఏ పీవో ను టీడీపీ నాయకులు కనితి మధు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీపురం గ్రామంలోని ఎస్టి కాలనీ నందు ఉన్న నిర్మాణ దశలోనే ఆగి ఉన్న అంగనవాడి భవనం గత కొన్ని సంవత్సరాల క్రితం లక్ష్మీపురం పంచాయతీ గ్రామంలో ఎన్ ఆర్ ఇ జి ఎస్ నిధుల నుండి రెండు అంగన్వాడి భవనాలు మంజూరు అయ్యాయని తెలిపారు. అందులో లక్ష్మీపురం గ్రామంలోని ఎస్సీ కాలనీ లో ఉన్నటువంటి అంగన్వాడి భవనం పూర్తి నిర్మాణం జరిగిందని మరి ఎస్టీ కాలనీలో ఉన్న మినీ అంగన్వాడి భవనం ఎందుకు నిర్మాణానికి నోచుకోలేదని పూర్తి సమగ్ర దర్యాప్తు చేసి తిరిగి మరలా పునరుద్దించాలని కోరారు. సుమారు పది సంవత్సరాల నుంచి అంగనవాడి భవనం లేక అంగనవాడి టీచర్ వారి గృహమునందే పిల్లలకి పాఠాలు చెబుతూ గడుపుతున్నారని భవనం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చింతూరు పిఓకు తెలియజేసినట్లు తెలిపారు. సచివాలయ భవనం గత ప్రభుత్వంలో మంజూరుకు నోచుకుందని కానీ అది కూడా నిర్మాణ దశలోనే ఆగిపోయి ఉన్నదని పంచాయతీ భవనంలో ప్రభుత్వ కార్యకలాపాలు నడుస్తున్నాయని భవనం చాలా చిన్నదిగా ఉండటం వల్ల పంచాయతీ ప్రజలకు ఇబ్బంది జరుగుతున్నదని తెలిపారు. రెండు పంచాయతీలు రాంగోపాల్ పురం లక్ష్మీపురం సుమారు 17 గ్రామల ప్రజలకు చిన్న పంచాయతీ భవనం సరిపోక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే ఆగిపోయి ఉన్న భవనాన్ని తిరిగి నిర్మించాలని కోరారు. సమస్యలు విన్న పిఓ స్పందించి మీ సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ మండల నాయకులు పుట్టి రమేష్, బాబు, కొరాసా భద్రమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పి.హెచ్.సి డాక్టర్స్ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి



**చింతూరు, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేఖరి):** గత నెల 25వ తేదీన నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రలలో పని చేస్తున్న వైద్యులు తమ న్యాయమైన సమస్యలు ఇన్ సర్వీస్ లో ఉన్న వైద్యులకి పిజి కోటా సీట్లు క్లినికల్ 30% నుండి 15% వరకు అలాగే నాన్ క్లినికల్ కోటాలో 50% నుండి 30% వరకు తగ్గించారని, ఏజెన్సీలో పని చేస్తున్న డాక్టర్స్ కి ఏజెన్సీ అలవెన్సెస్ ఇవ్వడం లేదని టైమ్ బాండ్ పదోన్నతులు కల్పించడం లేదని చంద్రన్న సంచార చికిత్సలో రావాల్సిన అలవెన్స్ 4 వేలు రూపాయలు ఇవ్వడం లేదని, పై సమస్యను పరిష్కరించాలని కోరుతూ శాంతియుత నిరసన కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఈ డిమాండ్స్ గతంలో కూడా వైద్యులకు ప్రభుత్వాలు అమలు చేస్తూ వస్తూనే ఉన్నారు వాళ్ళు అడిగేవి కొత్త డిమాండ్స్ ఐతే కాదు కాబట్టి ప్రభుత్వం కూడా ఈ విషయాలను త్వరగా పరిష్కారం చేసే దిశగా ఆలోచన చెయ్యాలని ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగేశ్వరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు పోరాడుతున్న డాక్టర్లు కు ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలియజేశారు. అత్యవసర పరిస్థితులలో ఉండాల్సిన డాక్టర్స్ రోడ్డు మీదకు రావడం వలన ప్రజలు అత్యవసర పరిస్థితులలో చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు వస్తాయని అలాంటి పరిస్థితులు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని గుర్తు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రలలో డాక్టర్స్ లేక పారామెడికల్ సిబ్బంది తో వైద్య సేవలు నడుస్తున్నప్పుడు ఏమైనా గొడవలు జరిగితే దానికి బాధ్యులు కూడా ప్రభుత్వమే అవుతుంది కాబట్టి సాధ్యమైనంత త్వరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రలలో పని చేస్తున్న డాక్టర్స్ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి డాక్టర్స్ అందరు డ్యూటీలలో వచ్చే విధంగా చూడాలని, అత్యవసర సేవలు ప్రజలకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రభుత్వానికి ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ తరుపున విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

# పెన్షన్లు పంపిణీ చేసిన కాశి నవీన్



**రాజమహేంద్రవరం, అక్టోబర్1 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** చంద్రబాబు నేతృత్వంలో విజయవంతంగా నడుస్తున్న కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ తెలిపారు. స్థానిక 50వ డివిజన్ లో ఈరోజు ఉదయం సామాజిక పెన్షన్లను కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల హామీలు ప్రతిదీ నెరవేరుస్తూ ప్రజల మెప్పుతోపాటు దీవెనలు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొందుతున్నారని అన్నారు. కచ్చితంగా రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి మరుకుర్తి రవి యాదవ్, చింతపల్లి నాని, ఎం చంద్రశేఖర్, యేసు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన కార్యక్రమంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు

## -ఎస్సై సంతోష్ కుమార్



**వి.ఆర్.పురం, అక్టోబర్1 (తెలుగురాష్ట్రం విలేకరి):-** దేవీ నవరాత్రుల సందర్భంగా ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరిగేలా కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వి.ఆర్.పురం ఎస్సై సంతోష్ కుమార్ సూచించారు. నిమజ్జనంలో పాల్గొనే వారు మద్యం సేవించి రాకూడదని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లో వరద పరిస్థితులు కొనసాగుతున్న కారణంగా భద్రతా దృష్ట్యా సాయంత్రం 6 గంటల లోపు నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేయాలని ఎస్సై సంతోష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు నియమ నిబంధనలు పాటించి భక్తి భావంతో కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది

## -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేకరి):** రైతు బాగుంటేనే జిల్లా, రాష్ట్రం, దేశం బాగుంటాయని, రైతుకు బాసటగా నిలిచేందుకు జివిస్టి స్లాబులను మదింపు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సూపర్ జీఎస్టీ ..సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా వాణిజ్య పన్నులు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికరాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా జాయింట్ కలెక్టర్, జీఎస్టీ నోడల్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. జివిస్టి తగ్గింపుకు ముందు తర్వాత రైతులకు కలిగిన ఆర్థిక ప్రయోజనాలను సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జివిస్టి సవరించిన రేట్లు అమల్లోకి వచ్చాయని, పేద మధ్య తరగతి వర్గాల ప్రజలకు, రైతుల సంక్షేమానికి దోహదపడుతుందన్నారు. జీఎస్టీ స్లాబులు తగ్గింపుతో వివిధ వస్తువులు, సేవల తగ్గడం వలన కలిగే ప్రయోజనాల గురించి లబ్ధిదారుల్లో అవగాహన పెంచడానికి ఒక నెల రోజులు పాటు ప్రచారాన్ని నిర్వహిస్తామని చెప్పారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ లో భాగంగా, వ్యవసాయ రంగం, వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రయోజనాలను వివరిస్తూ.. ట్రాక్టర్లకు జివిస్టీ 12% నుంచి 5% కు తగ్గిందని, ట్రాక్టర్ విడిభాగాలు, టైర్లు, హైడ్రాలిక్ పంపుల పన్ను 18% నుంచి 5% కు తగ్గిందన్నారు. ఎరువుల ముడి పదార్థాలపై 18% నుంచి 5 % వరకు, బయో -పురుగు మందులు, సూక్ష్మ పోషకాలపై 12 % నుంచి 5% వరకు ధరలు తగ్గాయన్నారు. సౌర శక్తితో నడిచే పరికరాల మీద కూడా 12 % నుంచి 5% నికి తగ్గించడం జరిగిందని, స్ప్రింక్లర్లు, బిందు సేద్యం ఫ్రెషర్లు, కంపోస్ట్ యంత్రాలపై జివిస్టి 5 % కి తగ్గిందని చెప్పారు. క్షీర పరిశ్రమలో పాలు, చీజ్ పై జీఎస్టీ లేదని, వెన్న, నెయ్యి మీద 12 % నుంచి 5 % వరకు జీఎస్టీ ని తగ్గించడం జరిగిందన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమలో తయారుచేసిన, నిలువ చేసిన కూరగాయలు, పండ్లు, గింజలపై 12 శాతం నుంచి 5% వరకు తగ్గిందని, ఆక్వాకల్చర్ మరియు తేనెటీగల పెంపకం, చేపల ఉత్పత్తులపై 12 % నుంచి 5 % శాతంకి జివిస్టి తగ్గించబడినదని తెలిపారు. సహజ సిద్ధమైన తేనెపై జీఎస్టీ తగ్గించడం వల్ల తేనెటీగల పెంపకం చేసే వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. జివిస్టీ తగ్గించడం కారణంగా రైతులు వ్యవసాయ పనిముట్లు మరియు వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరకే పొందగలుగుతారన్నారు. దీని ఫలితంగా వ్యవసాయ ఖర్చులు తగ్గి, అధిక దిగుబడిని సాధించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత, గ్రామీణ ఆదాయం, ఆహార భద్రత మెరుగుపడతాయని వివరించారు. శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జివిస్టి స్లాబులు తగ్గింపు కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల ఆదాయాన్ని కోల్పోయినప్పటికీ రైతులకు, సామాన్య మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందనే ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలు, రైతులు జీఎస్టీ ఆర్థిక ఫలాలను పొంది, ఆర్థికంగా లాభపడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, జీఎస్టీ మోడల్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏలూరు డివిజన్ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కెపి శైలజ శ్రీ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, వాణిజ్య పన్నుల శాఖ భీమవరం, తణుకు సర్కిల్స్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు వి.కేదారేశ్వర రావు, కె.వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, ఇన్చార్జి తహసీల్దార్ ఎ.కాళీ కృష్ణ, భవన నిర్మాణ శాఖ చైర్మన్ వలవల బాబ్జి, భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, ముత్యాల ఆంజనేయులు, ఆకాశపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరు చెరువు అభివృద్ధికి నిధులు ఇప్పించండి


## -నీటి సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్



**పోలవరం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పోలవరం మండలంలోని కోత్తూరు చెరువు అభివృద్ధికి నిధులు ఇప్పించాలని కోరుతూ జనసేన పార్టీ సీనియర్ నాయకులు, డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబుకు కొత్తూరు నీటి సంఘం అధ్యక్షులు పాదం రాంబాబు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పాదం ప్రసాద్ మాట్లాడుతూ వేలాది ఎకరాల సాగుకు ఉపయోగపడే కొత్తూరు చెరువు అభివృద్ధికి నిధులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కొత్తూరు చెరువు అభివృద్ధి చెందాలంటే ఇసుక కాలువకు పడిన గండ్లు, శాశ్వత మరమత్తు పనులకు, కడెమ్మ కాలవ పూడికతీత, జంగిల్ పనులు, మంగళ వారి కురివిడి మరమత్తు పనులకు, జోడిమల్ల కురివిడి, చెక్ డ్యామ్ నిర్మాణ పనులు, కర్రీ పంపు భోది, కడెమ్మ కాలువ నుండి కృష్ణారావు పేట వరకు పుంత పనులు, కృష్ణారావుపేట నుండి గాడాల చెరువుకు రోడ్డు పొడిగింపు, కామాయమ్మ చెరువు తూము మరమ్మత్తు పనులు, కొత్తూరు చెరువు పూడికతీత, జంగిల్, గట్టు గ్రావెల్ పనులకు నిధులు ఇప్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సోమరౌతు మల్లికార్జునరావు, పాము రామకృష్ణ, మండవల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాలయోగి జన్మదిన వేడుకలు

**అంబాజీపేట, అక్టోబర్ 1(తెలుగురాష్ట్రం విలేకరి):**



మాజీ లోక్ సభ స్పీకర్ దివంగత గంటి మోహన్ చంద్ర బాలయోగి జన్మదిన వేడుకలు పుల్లేటికుర్రు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ జల్లి బాలరాజు బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోనసీమ అభివృద్ధికి బాలయోగి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరా రవి, పంచాయతీ వార్డు సభ్యులు అకెళ్ళ సూరిబాబు, కత్తుల బాలస్వామి మాజీ ఎంపీటీసీ కత్తుల బాలరాజు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు బొరుసు రాజా, బీర ప్రకాశం, నెల్లి స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ యువసేన అధ్యక్షులు సమాకూర్చిన బట్టలను బాలయోగి జయంతి సందర్భంగా పేదలకు పంపిణీ చేశారు.

# బాబు షుఌ్యరిటీ - జాబు గ్యారెంటీ నినాదాన్ని నిజం చేశాం

## -ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 1(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**



ఎన్నికల్లో హామీ ఇస్తూ -బాబు షుఌ్యరిటీ - జాబు గ్యారెంటీ అని ఇచ్చిన హామీ మేరకు దాన్ని నిజం చేయడం జరిగిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించి నగరంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమితుల్కెన 58 మంది ఉపాధ్యాయులను బుధవారం ఆయన ఎస్కెవీటీ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో కలుసుకుని అభినందించారు. వారందరికీ ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చ్కెర్మన్ కుడుపూడి సత్తిబాబుతో కలిసి ఆయన జ్ఞాపికగా పార్కర్ పెన్నులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ "సీఎంగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు నాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్పైనే పెట్టారని గుర్తు చేశారు. అవినీతిలేకుండా పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. పదిహేనేళ్లలో 14 సార్లు డీఎస్సీని పెట్టడం జరిగిందని, 1,96,619 ఉద్యోగాలిచ్చామని, ఇకపైనా ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుందన్నారు. ఈ విషయంలో నిరుద్యోగులు అధ్కెర్య పడాల్సిన పని లేదన్నారు. పేదరికంలేని సమాజం చూడాలనేది తమ కూటమి లక్ష్యంమని, పేదరికంలేని సమాజాన్ని చూడాలంటే అది విద్యతోనే సాధ్యమన్నారు. మగవాళ్లకంటే మహిళలే మంచిగా చదువు చెప్పగలరని, ఇంటిని కూడా మహిళలే చక్కగా తీర్చిదిద్దుతారని, అందుకే సంక్షేమ కార్యక్రమాలు అందించే విషయంలో మహిళలకే ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నామన్నారు. మహిళలకు కోసం తమ కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, స్త్రీశక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, దీపం పథకం అమలు చేస్తున్నామని, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలున్నా.. వారందరికీ రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో డబ్బులు వేయడం జరిగిందని సూపర్ సిక్స్ సూపర్ హిట్టయ్యిందన్నారు. ప్రధాని సూపర్ జీఎస్టీ తీసుకురావడం వల్ల ధరలు తగ్గాయన్నారు. కూటమి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకోవడం ద్వారా 10 లక్షల ఉద్యోగాలు రానున్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సాగు చేసిన పంట వరద పాలాయే!

## -నీట మునిగిన పంటలను పరిశీలించిన ఎంపీపీ కారం లక్ష్మి



**వి.ఆర్.పురం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేఖరి):** వి.ఆర్.పురం మండలంలోని రామవరం పంచాయతీ పరిధిలో గత వారం రోజులుగా కొనసాగుతున్న వరదల కారణంగా నీట మునిగిన పొలాలను మండల పరిషత్ అధ్యక్షురాలు కారం లక్ష్మి పరిశీలించారు. సోములగూడెం, రామవరం గ్రామాల్లో వరి, మిర్చి పంటలు ఇంకా వరద నీటిలోనే మునిగి ఉండటం వల్ల రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్టు ఆమె తెలిపారు. సాగు చేసిన పంటలు గోదావరి వరదలతో ఎకరాల కొద్దీ నష్టపోవడంతో రైతులు కష్టాల్లో కూరుకుపోయారని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్టం చెందిన ప్రతి రైతుకూ ప్రభుత్వం ఎకరానికి కనీసం 25 వేల రూపాయల నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వీఆర్ఓ ఐమావతి, అగ్రికల్చర్ అధికారి సరీత, సర్వేయర్ నరసింహారావు, సీపీఎం నాయకులు కారం సుందరయ్య, పి.బొజ్జి ఆసు, లక్ష్మయ్య, పీసా కార్యదర్శి గొర్రె రాజు, గ్రామస్థులు బోదిబోయిన సురేష్, కుంజ బుచ్చిరాజు, పుసం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వీరంపాలెం పీఠంలో వైభవంగా దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేకరి):** వీరంపాలెంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంబరాన్ని అంటుతున్నాయి. మహర్నవమి సందర్భంగా బుధవారం అమ్మవారిని చండీ స్వరూపంలోనూ, రాజరాజేశ్వరి స్వరూపంగాను మూల మంత్రాలతో విశేష అర్చనలు, హోమాధి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ఈలి వెంకట మధుసూదనరావు (నాని) దంపతులు, శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం ప్రతినిధి ఈమని శశి కుమార్ దంపతులు, సీఐ మూర్తి దంపతులు, కందుల శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం నవరాత్రుల్లో అమ్మవారి సేవ ఒక రోజు ఎక్కువగా చేసుకునే అవకాశం కలగడంతో చండీస్వరూపంగాను రాజరాజేశ్వరి స్వరూపంగాను అమ్మవారి మూల మంత్రాలతో విశేష అర్చనలు జరిపించామని తెలిపారు. రేపు విజయదశమి పర్వదిన సందర్భంగా మహిషాసుర మర్దనిగా అమ్మవారిని అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులందరూ విచ్చేసి అమ్మవారిని దర్శించి తరించాలని కోరారు.

# నిర్వాసితుల భూములకు రక్షణ

## -చింతూరు సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ



**వి ఆర్ పురం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేఖరి):** గత రెండు నెలలుగా పరిహారం ఒక లక్ష పదిహేను వేల రూపాయలు నష్టపరిహారం పొందిన భూములను సిపిఎం గిరిజన సంఘం భూ ఉద్యమం పేరుతో పేదల భూములను ఆక్రమించి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన విషయమై అఖిలపక్ష కమిటీగా ఏర్పడి ప్రభుత్వం దృష్టికి తెలపగా 22/09/25 తేది (గత నెల) నిర్వశిత భూములను సిపిఎం గాని ఇతరులు ఎవరైనా ఆక్రమించడం చట్ట రీత్యా నేరం. ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ చింతూరు వారు ఆదేశాలు జారీ చేయడం హర్షించనీయమైనదని అఖిలపక్షం తెలిపింది. ఇప్పటికైనా సిపిఎం పార్టీ తన రాజకీయ స్వార్థంతో ఇటువంటి తప్పుడు చర్యలు చేయవద్దని అఖిలపక్షం తెలిపింది. విఆర్ పురంలో అఖిలపక్ష కమిటీ తరపున సబ్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు కాపీని ఇస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు బిజెపి, టిడిపి, వైసిపి, జనసేన, సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలలో సెక్షన్ 38/1, 38/2,4/4 ప్రకారం నిర్వాసితుల రైతులకు పూర్తి ప్యాకేజీ ఇచ్చి ఇక్కడి నుంచి తరలి వెళ్లే వరకు వారికి హక్కు ఉంటుందని పరిగణించడం జరిగింది. మూడవ వ్యక్తి ప్రవేశం నేరంగా పరిగణించ పడుతుందని ఆదేశాలు ఇచ్చారని పూర్తిగా ప్యాకేజీ వచ్చేవరకు నిర్వాసితులకి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఆదేశాలు ఇచ్చారని అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ పోరాటంలో రైతులు ఉద్యమానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు, పాత్రికేయులకు ప్రత్యేకమైన ధన్యవాదాములు అని అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ -పాయం వెంకయ్య మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ముత్యాల రాంబాబు మండల అధ్యక్షులు సోంది నాగేశ్వరావు, ఎస్టీ మోర్చా డివిజన్ నాయకులు, ఉయిక రత్తయ్య మండల సెక్రెటరీ, కడుపు వెంకటరమణ, గూటల రాంబాబు, బొర్రా కామేశ్వరి జిల్లా కార్యదర్శి, కరక పవన్ కుమార్ కూనవరం మండల అధ్యక్షులు, వైసీపీ- మాదిరెడ్డి సత్తిబాబు మండల అధ్యక్షులు, మాచర్ల గంగయ్య రాష్ట్ర కమిటీ, బొడ్డు సత్యనారాయణ జిల్లా కమిటీ, చిక్కల బాలకృష్ణ జిల్లా అధికార ప్రతినిధి, మోడం నరేష్ మండల కమిటీ క్రియాశీలక సభ్యులు, టీడీపీ- వాళ్ల రంగారెడ్డి జడ్పిటిసి,ముత్యాల రామారావు (మాజీ జడ్పిటిసి, బొర్రా నరసింహారావు, ముత్యాల శేఖర్, సిపిఐ- జుత్తుక సూర్యచంద్రరావు, కర్నాటి రాంబాబు సిపిఐ సెక్రెటరీ, తాటుకూరి శ్రీను, శివగిరి కామేశ్వరావు, జనసేన- ములకల సాయి కృష్ణ మండల అధ్యక్షులు, బాగుల ప్రమీల రాణి మహిళా అధ్యక్షురాలు, బాగుల అంజనరావు కార్యదర్శి, ముంజపు సాయిరాం, మాచర్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీపీ రవికుమార్ పుట్టినరోజు



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేకరి):** మాజీ ఎంపీపీ, మండల తెదేపా అధ్యక్షుడు పరిమి రవికుమార్ పుట్టినరోజు వేడుకలను తెదేపా నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. వారి మధ్యనే కేక్ కోశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా పరిమి రవి కుమార్ కు నాయకులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిలపర్తి వెంకట్రావు, ముత్యాల సత్యనారాయణ, పాతూరి రామ్ ప్రసాద్, గంధం సతీష్, దాసరి అప్పన్న , శనగణ శ్రీనివాస్, వటూరి రాంబాబు, మిద్దె కనకరావు, మద్దుకూరి ధనరాజ్, ముప్పిడి రమేష్, పీతల సత్యనారాయణ, ఎరుబండి సతీష్, పసలపూడి రాంబాబు, బెజవాడ శ్రీను, చిటికన శ్రీను, పరిమి వెంకటేశ్వరరావు, శీలి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తాం

### -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేకరి):**
అర్హులైన ప్రతి ఒక్కరికి సామాజిక పింఛన్లను అందజేస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.తాడేపల్లిగూడెం వినాయక నగర్ లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సంయుక్తంగా బుధవారం పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లను అందజేసి, వారి ఆరోగ్య స్థితిగతులను, పిల్లల చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను మహిళలు, ఆడపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నెల నెల తీసుకుంటున్న పెన్షన్ మొత్తంలో కొంత సొమ్మును దాసుకుంటే భవిష్యత్తులో ఆర్థిక అవసరాలకు ఆసరాగా ఉంటుందని వివరించారు. అనంతరం వినాయక నగర్ లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ తాడేపల్లిగూడెం పేరిట పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తాలూకా ఆఫీస్ అన్న క్యాంటీన్ వద్ద పింక్ టాయిలెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బస్టాండ్ వెనుక భాగంలో సుమారు 7 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఇంచార్జ్ తహాసిల్దార్ ఏ.కాళీ కృష్ణ , కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న వైద్యులు డాక్టర్ సుందర్ ప్రసాద్

**వి.ఆర్.పురం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేఖరి):**






శ్రీరామగిరి పంచాయతీ పరిధిలో చోక్కనపల్లి గ్రామానికి చెందిన ముర్ల శిరీష కుటుంబ గృహం నిన్న ప్రమాద శావత్తు మంటల్లో దగ్ధమై నిరాశ్రయులుగా మిగిలిపోయింది. ఈ విషయాన్ని గతంలో విఆర్ పురం మండలంలోని ప్రభుత్వ వైద్యునిగా పని చేసిన డాక్టర్ సుందర్ ప్రసాద్ స్థానికుల ద్వారా తెలుసుకొని మండల ప్రజలపైన ఉన్న మమకారంతో స్థానికులు మోడెం నరేష్, సోడే చిరంజీవి ద్వారా బాధితులకు మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయం ముర్ల శిరీష కుటుంబానికి తాత్కాలిక ఊరటనిచ్చినా, తమ కష్టాల్లో నిలిచిన మానవతా హృదయం ఎంతో గొప్పదిగా నిలుస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. అగ్ని ప్రమాదాలు ఊహించని వేళల్లో చెలరేగిపోవడం వల్ల గ్రామీణ కుటుంబాలు తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సమాజంలో ఇలాంటి సహకారం మరింత విస్తరించాలని వారు కోరారు.

# పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రోషన్ కుమార్



**చింతలపూడి, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ సామాజిక భరోసా నెలవారి పింఛన్ల పథకంలో భాగంగా బుధవారం జంగారెడ్డిగూడెం పాత బస్టాండ్ ఏరియాతో పాటు డాంగే నగర్ లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పర్యటించి స్వయంగా లబ్దిదారులకు పింఛన్లు అందజేసి పెన్షనర్ల కుటుంబ యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారా, లేదా అంటూ అవ్వ తాతల దగ్గర ఆరా తీశారు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తున్నట్లు ఎమ్మెల్యేకు లబ్ధిదారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఉదయం 6.00 గంటల నుంచి నియోజకవర్గంలో సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు వంటి నిరుపేద, నిస్సహాయ వర్గాల కష్టాలను తొలగించడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని ఒక ముఖ్యమైన సంక్షేమ పథకంగా అమలు చేస్తోందని అన్నారు. దేశంలో సామాజిక భద్రతా పెన్షన్ కోసం అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని ఎమ్మెల్యే తెలియజేశారు.




అమలాపురం పట్టణంలో నిర్వహించిన జిఎస్టి అవగాహన ర్యాలీలో పాల్గొని వ్యాపారస్తులకు జిఎస్టి సంస్కరణల గురించి వివరించిన ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు

# నూతన జీఎస్టీ విధానంతో అన్ని వర్గాలకు లబ్ది

### -ఎంపీడీవో వెంకటేష్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం విలేకరి):**
ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీఎస్టీ విధానంతో అన్ని వర్గాలకు గణనీయమైన లబ్ధి చేకూరుతుందని ఎంపీడీవో ఎం.వెంకటేష్ తెలిపారు. మండలంలోని దండగర్రలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధి వెంకటేష్ మాట్లాడుతూ నిరుపేదలపై ఆర్థిభారాన్ని తగ్గించేందుకే ప్రభుత్వం నిత్యవసర వస్తువులపై జీఎస్టీ తగ్గించిందని తెలిపారు. జిఎస్టి పన్ను విధానంలో చేసిన మార్పులు, వాటి వల్ల ప్రజలకు చేకూరే మేలు వంటి విషయాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసగాని రాంబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు బందెల కృష్ణారావు, కార్యదర్శి ముత్తయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమలాపురం బాలయోగి స్టేడియంలో నూతనంగా నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు

# సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా గోపన్నపాలెంలో ట్రాక్టర్ల తో రైతుల భారీ ర్యాలీ

### -ఆకట్టుకున్న రైతుల ట్రాక్టర్ల ర్యాలీ-ట్రాక్టర్ ను స్వయంగా నడిపి రైతులలో జోష్ నింపిన జిల్లా కలెక్టర్




**ఏలూరు, అక్టోబర్, 1 (తెలుగురాష్ట్రం విలేకరి):**
సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయమ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమం అనంతరం దెందులూరు నియోజకవర్గంలోని రైతులు ట్రాక్టర్ లతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గోపన్నపాలెం నుండి వేగవరం, సోమవరప్పుడు మీదుగా బైపాస్ రోడ్డు లో లక్ష్మీపురం వరకు రైతులు షుమారు 200 ట్రాక్టర్ లతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, వ్యవసాయ , అనుబంధ రంగాల అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమీషనర్ నాగార్జునరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. (జిల్లా సమాచార శాఖ, ఏలూరు జిల్లా, ఏలూరు వారిచే జారీ చేయబడినది)

# పార్టీలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం ఉంటుంది -ఎమ్మెల్యే శిరీష దేవి



**రంపచోడవరం, అక్టోబర్ 1 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం కల్పిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నూతనంగా ఎంపికైన మండలం పార్టీ అధ్యక్షులు మరియు వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ లకు దేవస్థానాల చైర్మన్ మరియు పాలక మండలి సభ్యులకు ఆత్మీయ అభినందన సన్మాన సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్న సేవలంధించిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందన్నారు. అలాగే నూతనంగా ఎంపికైన మండల పార్టీ అధ్యక్షులు జమాల్ ఖాన్ -చింతూరు, పెంటపాటి అనంతమోహన్ -రంపచోడవరం, పల్లాల వెంకటరెడ్డి -గంగవరం, గోళ్ళ చంటిబాబు - దేవీపట్నం, మారేడుమిల్లి గురుకు శేష కుమార్అలాగే రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, రాష్ట్ర పరిశ్రమలు మరియు మౌళిక వసతులు డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు మరియు రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె సునీత లను సన్మానం చేశారు.అలాగే సీతపల్లి గడి బాపనమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ దేవిపట్నం పోచమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ మరియు డైరెక్టర్ లను పూలమాలలతో శాలువా లతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా ప్రస్తుతం రాష్ట్ర స్థాయి లో రెండు కార్పొరేషన్ లకు డైరెక్టర్ లు ఎస్టీ కమిషన్ లో డైరెక్టర్ స్థానాలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారు మంచిగా సేవలు అందిస్తూ పార్టీకి మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ లోక్ సభ స్పీకర్ శ్రీ జిఎంసి బాలయోగి గారి జయంతి సందర్భంగా అమలాపురం బాలయోగి ఘాట్ నందు నివాళులర్పించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు

# ఆస్ట్రేలియాలో ఆరంగేట్ర టెస్టులోనే బుడ్డోడి అద్భుతం

## సిక్సర్ల వర్షం కురిపించిన వైభవ్ సూర్యవంశీ



**భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ఆస్ట్రేలియా గడ్డపై అద్భుతాలు సృష్టించాడు. కేవలం 14 ఏళ్ల వయసున్న వైభవ్, ఆస్ట్రేలియాలో తన మొదటి అండర్-19 టెస్ట్ మ్యాచ్‌లోనే సెంచరీ బాది సంచలనం సృష్టించాడు. ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన ఈ మ్యాచ్‌లో అతను కేవలం 78 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో సిక్సర్ల వర్షం కురిపించి, ఆస్ట్రేలియా బౌలర్లను తికమక పెట్టాడు. వైట్ బాల్ క్రికెట్‌లో సాధించలేని పనిని, అతను రెడ్ బాల్ క్రికెట్‌లో చేసి చూపించాడు. న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు బ్రెండన్ మెకల్లమ్ వంటి దిగ్గజ క్రికెటర్ రికార్డును సమం చేసి, భవిష్యత్ స్టార్‌గా తన సత్తాను చాటాడు.**

వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో మెరుపులు మెరిపించాడు. ఆస్ట్రేలియాకు వ్యతిరేకంగా కేవలం 37 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇందులో 4 సిక్సర్లు ఉన్నాయి. ఆ తర్వాత 78వ బంతికి తన సెంచరీ పూర్తి చేసుకున్నాడు, ఈ సెంచరీలో 7 భారీ సిక్సర్లు ఉన్నాయి. మొత్తంమీద అతను 86 బంతుల్లో 8 సిక్సర్లు, 9 ఫోర్లతో 113 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 131.39 గా నమోదైంది. ఆస్ట్రేలియా అండర్-19 జట్టు పై అతను ఏ ఫార్మాట్‌లో సాధించిన రెండవ సెంచరీ ఇది కాగా, ఆస్ట్రేలియా గడ్డపై వైభవ్ సూర్యవంశీ సాధించిన మొదటి సెంచరీ ఇదే కావడం విశేషం.

వైభవ్ సూర్యవంశీ ఆస్ట్రేలియా అండర్-19 జట్టుపై 78 బంతుల్లో సెంచరీ పూర్తి చేసి, యూత్ టెస్ట్ చరిత్రలో నాలుగవ వేగవంతమైన సెంచరీని నమోదు చేశాడు. ఈ అద్భుత ప్రదర్శనతో అతను న్యూజిలాండ్ దిగ్గజ బ్యాట్స్‌మెన్ బ్రెండన్ మెకల్లమ్ రికార్డును సమం చేశాడు. అండర్-19 టెస్టుల్లో 100 కంటే తక్కువ బంతుల్లో రెండు సెంచరీలు సాధించిన రెండవ ఆటగాడిగా వైభవ్ నిలిచాడు. బ్రెండన్ మెకల్లమ్ తర్వాత ఈ అరుదైన ఘనత సాధించిన ఏకైక ఆటగాడు వైభవ్ సూర్యవంశీనే కావడం అతని ప్రతిభకు నిదర్శనం.

వైభవ్ సూర్యవంశీకి ఇది ఆస్ట్రేలియాలో మొదటి పర్యటన. అంతకుముందు అతను ఇంగ్లాండ్‌లో పర్యటించినప్పుడు అతని ప్రదర్శన అంత గొప్పగా లేదు. కానీ ఆస్ట్రేలియాలో మాత్రం వైభవ్ తన అభిమానులను నిరాశపరచలేదు. తాను ఏ ఉద్దేశ్యంతో అక్కడికి వెళ్ళాడో, తన అభిమానులు అతని నుండి ఏమి ఆశిస్తున్నారో అదే చేసి చూపించాడు. వైభవ్ సూర్యవంశీ సెంచరీ సాధించి, ఆస్ట్రేలియా అండర్-19 జట్టుకు వ్యతిరేకంగా జరిగిన మొదటి యూత్ టెస్టులో భారత్‌ను బలమైన స్థితిలో నిలబెట్టాడు. అతని ఈ ప్రదర్శన భారత క్రికెట్‌కు ఒక గొప్ప భవిష్యత్తును సూచిస్తోంది.

# దీప్తి ఆల్రౌండ్ ప్రదర్శన

## శ్రీలంకపై 59 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు

## ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్




గౌహతి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్లో భారత్ బోణీ కొట్టింది. గౌహతీ వేదికగా శ్రీలంకతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్లో హర్మన్ ప్రీత్ సేన్ 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధిం చింది. అల్రౌండర్ దీప్తి శర్మ అర్ధసెంచరీకి తోడు మూడు వికెట్లు పడగొట్టి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించింది. తొలుత అమన్ జోత్ కౌర్ (57), దీప్తిలు అర్ధ శతకాలతో రాణించడంతో భారతజట్టు 17 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోర్ చేయగా స్నేహ్ రానా(2/32), తెలుగమ్మాయి శ్రీ చరణి(2/37)లు తిప్పేయగా శ్రీలంక మహిళలు 211కే ఆలౌటయ్యారు. టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన(8) త్వరగా పెవిలియన్కు చేరింది శ్రీలం క స్పిన్నర్ ఇనొకా రణవీర (4/46) విజృంభణతో ఒక దశలో 124కే ఆరు వికెట్లు పడి అలౌట్ అంచున నిలిచిన టీమిండియా నిలిచింది. ఈ క్రమంలో అమస్ జ్యోత్ -దీప్తి కలిసి ఏడో వికెట్ కు సెంచర్ భాగస్వామ్యం నెలకొల్పి ఆదుకున్నారు. ఆఖర్ బంతికి దీప్తి ఔట్ కాగా భారత్ 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. వర్షం అంతరాయాల నడుమ సాగిన వరల్డ్ కప్ ఆరంభపోరులో భారత జట్టు భారీ స్కోర్ చేసింది. అలాగని ఫామ్లో ఉన్న ఓపెనర్ మంధాన (8), ప్రతీకా రావల్ (37) రాణించలేదు. అయినా సరే టీమిండియా ప్రత్యర్థి శ్రీలంకు 270 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగిందంటే అందుకు కారణం అమన్ జోత్ కౌర్ (57), దీప్తి శర్మ(63), ఈ ఇద్దరి అద్భుత పోరాటంతో పుంజుకుంది టీమిండియా మంధాన బెబయ్యాక ప్రతీకతో కలిసి ఇన్నింగ్స్ నిర్మించింది హర్లీన్ డియోల్ (48), అర్ధ శతకానికి చేరువైన ఆమెను ఔట్ చేసిన ఇనోకా రణవీర తర్వాతి బంతికే జెమీమా రోడ్రిగ్స్ (0) ను క్లీన్ బోల్డ్ చేసింది. దాంతో.. హ్యాట్రిక్ పై నిలిచింది కానీ, దీప్తి శర్మ(53) వికెట్ను కాపాడుకుంది. క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (21) కట్ షాట్ ఆడబోయి వికెట్ కీపర్ సంజీవని చేతికి చిక్కింది. దాంతో.. 120-3తో పటిష్టంగా ఉన్న టీమిండియా 124-5 కు చేరింది. ఆ మరసటి ఓవర్లో రీచా ఘోష్(2) సైతం డియోల్ మాదిరిగానే కవర్స్లో ఆడబోయి చేతికి క్యాచ్ ఇచ్చింది. అంతే చూస్తుండగానే ఆరు వికెట్లు పడ్డాయి. సెంచరీ భాగస్వామ్యంతో.. టెయిలెండర్లతో కలిసి దీప్తి శర్మ జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించే బాధ్యత తీసుకుంది. ఆమెకు అమనోజోత్ కౌర్ (57) అండగా నిలవడమే కాదు భారీ షాట్లతో లంక బౌలర్ల లయను దెబ్బతీసింది కవిష ఓవర్లో సిక్సర్తో జట్టు స్కోర్ 170 దాటించింది. వీలుచిక్కినప్పుడల్లా చౌదరీలు బాదుతూ.. వీరిద్దరూ 78 బంతుల్లో 86 పరుగుల తోడించారు. దాంతో, భారత్ మరోసారి వర్షం అంతరాయం కలిగించే సమయానికి 40 ఓవర్లకు 210 రన్స్ చేయగలిగింది. బౌండరీ లైన్ వద్ద డైవ్ చేస్తూ క్యాచ్ అందుకోవడంతో సెంచరీ (103) భాగస్వామ్యానికి తెరపడింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దీప్తి శర్మకు లభించింది. అక్టోబర్ 5న జరిగే రెండో లీగ్ మ్యాచ్లో పాకిస్తాన్ మహిళలతో కొలంబోలో తలపడనున్నారు. వర్షం అంతరాయం

మహిళల వన్డే వరల్డ్ కప్ తొలి మ్యాచ్కు వరుణుడు ఆటంకం కలిగించాడు. తొలుత టీమిండియా 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 43 పరుగులు చేసింది. వీరిద్దరూ జోరు పెంచుదామనేలోపే వర్షం కురవడం మొదలైంది. దాంతో, సిబ్బంది పరుగున వచ్చి పిచ్ను ప్లాస్టిక్ కవర్లతో కప్పివేశారు. ఆ తర్వాత వర్షం తగ్గడంతో దాదాపు గంట విరామం తర్వాత తిరిగి "మ్యాచ్ 5.00గం?లకు ప్రారంభమైంది. దీంతో మ్యాచ్ ను అంపైర్లు 48 ఓవర్లకు కుదించారు. అనంతరం 40ఓవర్లు మ్యాచ్ ముగిసాక మళ్లీ వర్షం కురిసింది. ఆ సమయానికి భారతజట్టు 6వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అమన్ జ్యోత్(50), దీప్తి (37) క్రీజ్లో ఉన్నారు. నెబిలిటురుడు ఇండియా మహిళల ఇన్నింగ్స్: ప్రీతికా రావల్ (సి)గుణరత్నే (బి) రణవీర 37, మందాన (సి) గుణరత్నే (వి) ప్రబోధిని హర్లిన్ డియోల్ (సి) దిలారి (2) రణవీర 48, హర్మన్ ప్రీత్ (సి) సంజీవని (బి) రణవీక 21. రోడ్రిగ్స్ (వి)రణవీర (4, దీప్తి శర్మ (సి) సుగంధిక (బి) కులసూరియ 53, రీచా ఘోష్ (సి) ప్రబోదని (బి) బపట్టు 2, అమన్ జ్యోత్ కౌర్ (సి) గుణరత్నే (బి) ఉద్దేశిక 57, స్నేహ్ రాణా (నాటౌట్) 28, అదనం 15. (47 ఓవర్లలో 808 5008) 2692%ఎవఅ 2 : 1/14, 2/81, 3/120, 4/120, 5/121, 6/124, 7/227, 8/269 : 8-0-42-1, 550 10-1-55-2. ??? 9-0-46-0, ??? 8-0-51-0,5 ?? 9-0-46-4. ??? 3-0-24-1

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్ హాసిని పెరీరా (బి) క్రాంతి గాడ్ 14, ఆటపట్టు (1) దీప్తి శర్మ 43, హర్షిత (ఎలిబి) శ్రీచరణి 29, గుణరత్నే (ఎల్)అమ?జ్యోత్ కౌర్ 11, దిహారి (సి) రీచా (బి) దీప్తి 15, నీలాక్షి (బి) స్నేహ్) రాణా 36, అనుష్క సంజీవని (సి) హర్మన్ ప్రీత్ (బి) దీప్తి శర్మ 6, సుగంధిక (బి) స్నేహ్ రాణా 10, అధిన కులసూరియ (సి) మంధాన (వి) శ్రీచరణి 17, ప్రబోధిని (నాటౌట్) 14, ఇనోకా రణవీరా (ఎలిబి) ప్రతిక రావల్ 3, అదనం 14. (45 4ఓవర్లలో ఆలౌట్) 211 పరుగులు, వికెట్ల పతనం: 1/30, 2082 3/103 4/105, 5/130, 6/140, 7/173, 8/184, 8/199, 10/211 బౌలింగ్: క్రాంతి గోడ్ 9-0-41-1, అమస్ జ్యోత్ కౌర్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 20-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతిక రావల్ 2.4-0-6-1

# ఆసియా కప్ గెలిచి ఉంటే పాకిస్తాన్ ఏం చేసేవారో తెలుసా?

## షాకింగ్ నిజం బయటపెట్టిన షాహిద్ అఫ్రిది



**ఆసియా కప్ 2025 ఫైనల్‌లో భారత జట్టు పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించి కప్పును గెలుచుకుంది. ఈ మ్యాచ్ తర్వాత కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. టీమిండియా కప్పును తమ చేతులతో తీసుకోవడానికి ఇష్టపడలేదని తెలియడంతో, పీసీబీ ఛైర్మన్ మొహసిన్ నఖ్వీ ట్రోఫీని బయటకు పంపించారు. ఈ సంఘటనల మధ్య, పాకిస్తాన్ గెలిచి ఉంటే ఏం జరిగి ఉండేదో మాజీ క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, ముహమ్మద్ యూనిస్ బయటపెట్టారు.**

ఆసియా కప్ 2025 విజయం తర్వాత భారత జట్టు తమ తదుపరి సిరీస్‌కు సిద్ధమవుతోంది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టీమిండియా ఆదివారం జరిగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి కప్పును కైవసం చేసుకుంది. అయితే, ఈ మ్యాచ్ తర్వాత కొన్ని ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకున్నాయి. టీమిండియా తమ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోదని తెలియగానే, పీసీబీ ఛైర్మన్ మొహసిన్ నఖ్వీ ట్రోఫీని బయటకు పంపించారు. ఈ మధ్యలో ఒకవేళ పాకిస్తాన్ గెలిచి ఉంటే ఏం చేసేవారో అని మాజీ క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, ముహమ్మద్ యూనిస్ సంచలన విషయాలను బయటపెట్టారు. ఆసియా కప్ 2025లో ఫైనల్‌తో సహా భారత్, పాకిస్తాన్ మధ్య మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు పాకిస్తాన్ ఆటగాళ్లతో హ్యాండ్‌షేక్ చేయలేదు. ఈ సంఘటనతో పీసీబీ, వారి ఆటగాళ్లు చాలా ఆగ్రహానికి గురయ్యారు. సూపర్-4 మ్యాచ్‌లో పాకిస్తాన్ ఆటగాళ్లు ఫీల్డ్‌లో భారత జట్టును రెచ్చగొట్టే విధంగా అసభ్యకరమైన చేష్టలు చేశారు. ఫైనల్‌లో గెలిచిన తర్వాత సూర్యకుమార్ యాదవ్, టోర్నమెంట్‌లో ఆడిన అన్ని 7 మ్యాచ్‌ల మ్యాచ్ ఫీజును ఇండియన్ ఆర్మీకి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఫైనల్‌కు ముందు పాకిస్తాన్ మాజీ కెప్టెన్లు షాహిద్ అఫ్రిది, ముహమ్మద్ యూనిస్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు.

# ట్రోఫీ నేను ఇస్తేనే వాళ్లు తీసుకోవాలి..

## ఏసీసీ సమావేశంలో నఖ్వీ అడ్డదిడ్డమైన వాదన




**ఆసియా కప్ ముగిసి మూడు రోజులు గడుస్తున్నా, దాని చుట్టూ అలుముకున్న వివాదాలు మాత్రం సద్దుమణగడం లేదు. ఫైనల్‌లో పాకిస్తాన్‌ను ఓడించి భారత జట్టు తొమ్మిదోసారి టైటిల్‌ను గెలుచుకుంది. అయితే, మ్యాచ్ అనంతర బహుమతి ప్రదానోత్సవంలో చోటు చేసుకున్న సంఘటనలు పెద్ద కోల్డ్ వార్?కు దారితీశాయి.**

ఆసియా కప్ ముగిసి మూడు రోజులు గడిచినా దాని చుట్టూ ఉన్న గొడవలు ఇంకా సద్దుమణగడం లేదు. ఫైనల్‌లో పాకిస్తాన్‌ను ఓడించి మన భారత జట్టు తొమ్మిదోసారి టైటిల్‌ను గెలుచుకుంది. కానీ, మ్యాచ్ తర్వాత బహుమతి ఇచ్చే సమయంలో జరిగిన గొడవ చాలా పెద్దదిగా మారింది. ఏసీసీ అధ్యక్షుడు, పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ చీఫ్ అయిన మొహసిన్ నఖ్వీ ఈ మొత్తం గొడవకు ముఖ్య కారణం. ఫైనల్ అయిన కొద్ది రోజులకే దుబాయ్‌లో జరిగిన ఒక ఏసీసీ మీటింగ్‌లో ఈ గొడవ మరింత పెరిగింది. మెడల్స్, ట్రోఫీ ఇప్పటికీ మన భారత జట్టుకు అందకపోవడం కొందరు అధికారులకు కోపం తెప్పించింది. మంగళవారం ఆన్‌లైన్‌లో జరిగిన ఏసీసీ, బీసీసీఐ సమావేశం కూడా ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు.ద"మొహసిన్ నఖ్వీ ప్రవర్తన ఏసీసీ ఛైర్మన్‌గా అసలు బాలేదు" అని ఒక అధికారి చెప్పారు. మీటింగ్ మొదలుపెట్టేటప్పుడు, ఆసియా కప్ గెలిచినందుకు భారతదేశానికి అభినందనలు కూడా చెప్పలేదు. ఆశిష్ షెలార్ పదే పదే గుర్తుచేసిన తర్వాతే అతను అలా చేశాడు. "భారత్ గెలిచిన విషయం, ట్రోఫీ ఎందుకు ఇవ్వలేదో చెప్పడానికి అతనికి అస్సలు ఇష్టం లేదు. బీసీసీఐ వాళ్ళు ట్రోఫీ, మెడల్స్ ఏసీసీ ఆఫీస్‌కు పంపిస్తే, వాటిని తీసుకుంటామని చెప్పినా, అతను తప్పించుకున్నాడు" అని ఆ అధికారి తెలిపారు. ఫైనల్ మ్యాచ్ తర్వాత బహుమతి ఇచ్చేందుకు దాదాపు గంట ఆలస్యం కావడానికి కారణం నఖ్వీనే అని తర్వాత తెలిసింది. భారత్ ఒప్పుకోకపోయినా, తానే ట్రోఫీని ఇవ్వాలని నఖ్వీ పట్టుబట్టాడు. ఈ ఆలస్యంపై రవిశాస్త్రి వంటి మాజీ ఆటగాళ్లు కూడా చాలా కోప్పడ్డారు.

ఈ ట్రోఫీ గొడవ ఒక్కసారిగా మొదలవ్వలేదు. టోర్నమెంట్ అంతటా భారత్, పాకిస్తాన్‌తో హ్యాండ్‌షేక్ ఇవ్వకుండా ఒక ప్రత్యేక విధానాన్ని పాటించింది. ఇది మాజీ ఆటగాళ్ళు, టీవీ నిపుణులు, సామాన్యుల మధ్య పెద్ద చర్చకు దారితీసింది. భారత జట్టు మొదట ఐక్యతతో వ్యవహరించినప్పటికీ, పాకిస్తాన్ ఆటగాళ్లు మైదానంలో టీమిండియాను రెచ్చగొట్టేలా చెడ్డ చేష్టలు చేశారు. దీనికి గాను ఆటగాళ్లకు జరిమానాలు కూడా విధించారు. ఫైనల్ రాత్రి కెప్టెన్‌లను ఇద్దరు వేర్వేరు వ్యక్తులు ఇంటర్వ్యూ చేయడం వంటివి ఈ ఉద్రిక్తతను మరింత పెంచాయి. చాలా కోపతాపాలతో సాగిన ఆసియా కప్ ముగిసినా, బీసీసీఐ ఇప్పుడు మెడల్స్, ట్రోఫీని ఏసీసీ ద్వారా సరిగ్గా, నియమాల ప్రకారం అందజేయాలని కోరుకుంటోంది. కానీ మొహసిన్ నఖ్వీ ఇప్పటికీ ఈ గొడవకు ప్రధాన కారణం. ఏదేమైనా 2025 ఆసియా కప్ అనేది భారతదేశం గెలిచినందుకు ఎంత గుర్తుంటుందో, దాని చుట్టూ జరిగిన ఈ గొడవలు, రాజకీయాల వల్ల కూడా అంతే గుర్తుండిపోతుంది.

# నఖ్వీ నక్కజిత్తులు.. సల్మాన్ అఘా కవ్వింపులు.. బీసీసీఐ ఫిర్యాదులు!




**తొమ్మిదోసారి టీమ్‌ఇండియా ఆసియా కప్‌ను సొంతం చేసుకుంది. రెండు రోజులైనా సరే 'ఫైనల్' వేడి మాత్రం తగ్గలేదు. ట్రోఫీని ఇవ్వకుండా తన వద్దే పెట్టుకున్న నఖ్వీ, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా చేసిన ప్రకటన ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారిపోయాయి. ఇప్పటికే బీసీసీఐ తన అసంతృప్తిని వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. వారిద్దరిపై ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకూ సిద్ధమైంది. ఈక్రమంలో జరిగిన పరిణామాలపై ఓ లుక్కేద్దాం.**

### నఖ్వీ ఇలా..

ఆసియా కప్ ట్రోఫీని ఇవ్వకుండా తనతోపాటు తీసుకెళ్లడంపై ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఇప్పటికీ ట్రోఫీని భారత్‌కు అప్పగించేందుకు మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం. 'అదేమీ అతడి వ్యక్తిగత సొత్తు కాదు. ఆసియా క్రికెట్ కౌన్సిల్‌ది' అని బీసీసీఐ ఘాటుగా స్పందించింది. అయినా సరే, మొండిపట్టుదలతో నఖ్వీ కండీషన్లు పెట్టాడు. తమకు వెంటనే అప్పగించాలని బీసీసీఐ అధికారులు కోరగా.. వ్యక్తిగతంగా కెప్టెన్ సూర్యకుమార్ తన వద్దకు రావాలని నఖ్వీ డిమాండ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. బీసీసీఐ మాత్రం అంగీకరించకుండా.. ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఏసీసీ ఏజీఎంలో బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్లా గట్టిగానే ప్రశ్నించారు. తన ఆఫీస్‌కు భారత సారథిని రప్పించి పైచేయి సాధించినట్లు ప్రగల్భాలు పలకడమే నఖ్వీ 'నక్కజిత్తుల' ప్లాన్ అంటూ క్రికెట్ అభిమానులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

### ఇక సల్మాన్ ఇలా..

పహల్గాం ఉగ్రదాడిలో భారత పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మన సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలపై విరుచుకుపడింది. వాటిని చెల్లాచెదురు చేసేసింది. అయితే, ఉగ్రవాదానికి బాసటగా నిలిచే పాక్‌కు ఇది మింగుడు పడలేదు. పాక్ సైన్యమే రంగంలోకి దిగి భారత ఆర్మీ ప్రాంతాలపై దాడులకు తెగబడింది. వాటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. పాక్ ఆర్మీ ప్రాంతాలపై భారత సైన్యం కూడా విరుచుకుపడింది. ఈక్రమంలో ఆసియా కప్ ఫైనల్ అనంతరం ఉగ్రవాదంపై పోరాడిన భారత సైన్యానికి తన మ్యాచుల ఫీజును అందజేస్తున్నట్లు కెప్టెన్ సూర్య తెలిపాడు. దీంతో, పాక్ సారథి కూడా ఓ ప్రకటన చేశాడు. తమ మ్యాచుల ఫీజులు కూడా 'ఆపరేషన్ సిందూర్' బాధితుల కుటుంబాలకు అందజేస్తామని తెలిపాడు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదులనే లక్ష్యం చేసుకోగా.. పాక్ సాధారణ పౌరులపై భారత ఆర్మీ దాడులే చేయలేదు. అంటే, ఇక్కడ ఉగ్రవాదులకు పాకిస్థాన్ క్రికెట్ జట్టు పరోక్షంగా నిధులు అందజేసినట్లు అవుతుందనేది బీసీసీఐ ప్రధాన ఆరోపణ. దీనిపైనా ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు భారత క్రికెట్ బోర్డు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

అమలాపురం
అక్టోబర్ 02,
గురువారం 2025

CINIMA NEWS
https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

# నవరబర్ 21 'కొదమసింహం' రీ రిలీజ్

చిరంజీవి కెరీర్‌లో 'కొదమసింహం' చాలా ప్రత్యేకమైన సినిమా. ఆయన నటించిన ఒకే ఒక కౌబారు సినిమా ఇది. 1990, ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సాధించిన ఈ సినిమాను రీ రిలీజ్ చేయటానికి చిత్ర నిర్మాతలు ప్రయత్నాలు చేస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రాన్ని 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. విజయదశమి పర్వదినం సందర్భంగా రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు ఈ ప్రకటన చేశారు. చిరంజీవి కౌబారుగా నటించి ప్రేక్షకుల్ని అలరించిన 'కొదమసింహం' సినిమాలో రాజ్‌కోటి మ్యూజిక్‌బీ మోహన్‌బాబు కామెడీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కె.మురళీమోహన రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాధ, సోనం, వాణీ విశ్వనాథ్ కథానాయకురాళ్లుగా నటించారు. పేక్షకుల్ని మరోసారి ఎంటర్‌టైన్ చేసేందుకు ఈ చిత్రాన్ని సరికొత్తగా ముస్తాబు చేసి విడుదల చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు.



# అల్లు అర్జున్ సినిమాలో సమంత?

**అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా**
**సినిమాలో ఓ స్పెషల్ రోల్ కోసం సమంత పేరు పరిశీలన**
**ఈ పాత్ర కోసం ఆమెకు రూ. 3 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం**



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో రోజుకో ఆసక్తికర వార్త ప్రచారంలోకి వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో హాట్ టాపిక్ ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఓ కీలకమైన ప్రత్యేక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ సమంతను తీసుకునే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమాలో కథను మలుపు తిప్పే ఒక స్పెషల్ రోల్ ఉందట. ఆ పాత్రకు సమంత అయితే సరిగ్గా సరిపోతుందని భావించిన మేకర్స్, ఇప్పటికే ఆమెను సంప్రదించి చర్చలు జరిపినట్లు చెబుతున్నారు. ఈ ప్రత్యేక పాత్ర కోసం సమంతకు దాదాపు రూ. 3 కోట్ల వరకు పారితోషికం ఆఫర్ చేసినట్లు కూడా గట్టిగా ప్రచారం జరుగుతోంది. ఈ ఆఫర్‌కు సమంత కూడా సుముఖంగా ఉన్నారని, దాదాపుగా అంగీకరించినట్లేనని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. 'పుష్ప' సినిమాలో ఐటమ్ సాంగ్‌తో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఉర్రూతలూగించిన సమంత, ఆ తర్వాత నటిగా, నిర్మాతగా తన కెరీర్‌లో ముందుకు సాగుతున్నారు. ఆమెకున్న పాన్-ఇండియా క్రేజ్ దృష్ట్యా, అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఆమె ఉనికి ప్రాజెక్ట్‌కు మరింత బలాన్ని చేకూరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ వార్తలపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ ప్రచారమే నిజమైతే, ఈ క్రేజీ కాంబినేషన్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం.

# ఆకట్టుకుంటున్న ధనుశ 'తేరే ఇష్క్ మే' టీజర్

**'రాంజానా' కాంబోలో వస్తున్న ధనుశ్ కొత్త చిత్రం**
**'తేరే ఇష్క్ మే' టైటిల్‌తో సినిమా.. తాజాగా టీజర్ విడుదల**
**ప్రేమలో మోసపోయిన ఎయిర్‌ఫోర్స్ అధికారిగా ధనుశ్ పాత్ర**
**హీరోయిన్‌గా కృతి సనన్.. సంగీతం అందిస్తున్న ఏఆర్ రెహమాన్**
**పాత పాపాలు కడుక్కో అంటూ హీరోయిన్‌కు ఘాటైన డైలాగ్**
**నవంబర్ 28న హిందీ, తమిళ భాషల్లో సినిమా విడుదల**

ప్రముఖ నటుడు ధనుశ్, దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ కలయికలో వచ్చిన 'రాంజానా' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు ఈ విజయవంతమైన కాంబినేషన్‌లో 'తేరే ఇష్క్ మే' అనే మరో ఆసక్తికర చిత్రం రాబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ టీజర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. టీజర్‌ను బట్టి చూస్తే, ఇది ఒక తీవ్రమైన, భావోద్వేగభరితమైన ప్రేమకథ అని స్పష్టమవుతోంది. ముఖ్యంగా టీజర్‌లో ధనుశ్ చెప్పిన ఓ డైలాగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "నా తండ్రి దహన సంస్కారాల కోసం బనారస్ వెళ్లాను. అప్పుడే నీకోసం కాస్త గంగాజలం తీసుకురావాలనిపించింది. నువ్వు కొత్త జీవితం మొదలుపెడుతున్నావు కదా, కనీసం నీ పాత పాపాలను అయినా కడుక్కో" అంటూ కథానాయిక కృతి సనన్‌ను ఉద్దేశించి ధనుశ్ చెప్పే డైలాగ్ బాగుంది. ప్రేమలో మోసపోయిన ఓ యువకుడి ఆవేదన ఆయన పాత్రలో కనిపిస్తోంది. ఈ చిత్రంలో ధనుశ్ ఒక ఎయిర్‌ఫోర్స్ అధికారిగా నటించనున్నారు. ఆయన సరసన కృతి సనన్ కథానాయికగా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి హిమాన్షు శర్మ, నీరజ్ యాదవ్ కథను అందించారు. భూషణ్ కుమార్, కృష్ణ కుమార్, ఆనంద్ ఎల్ రాయ్‌లతో కలిసి హిమాన్షు శర్మ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు.




# మెగాస్టార్ సరసన 'శశిరేఖ'..

**ఆకట్టుకుంటున్న నయనతార లుక్**
**చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు' నుంచి కొత్త అప్‌డేట్**
**నయనతార పాత్ర పేరు 'శశిరేఖ'గా వెల్లడి, ఫస్ట్ లుక్ విడుదల**
**దసరా పండగకు మరో సర్‌ప్రైజ్ ఇస్తామన్న దర్శకుడు అనిల్ రావిపూడి**
**సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న విక్టరీ వెంకటేశ్**

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నయనతార పాత్ర పేరుతో పాటు ఆమె ఫస్ట్ లుక్‌ను అభిమానులతో పంచుకున్నారు.

ఈ చిత్రంలో నయనతార 'శశిరేఖ' అనే పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు అనిల్ రావిపూడి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా ప్రకటించారు. పాత్రకు సంబంధించిన లుక్‌ను కూడా విడుదల చేయగా, అది ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉండగా, దసరా పండగ సందర్భంగా రేపు మరో సర్‌ప్రైజ్ కూడా రాబోతోందని అనిల్ రావిపూడి తన పోస్టులో పేర్కొన్నారు. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. పండగ రోజు రాబోయే ఆ కొత్త కబురు ఏమై ఉంటుందా? అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ కూడా ఓ ముఖ్యమైన పాత్రలో నటిస్తుండటం విశేషం. చిరంజీవి, వెంకటేశ్ వంటి అగ్ర తారలు కలిసి నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేస్తామని గతంలోనే మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.





# ఎవరికీ తలవంచను...

## ఎంతటివారినైనా ప్రశ్నిస్తా: దీపికా పదుకొణే


**ఐఎమ్‌డీబీ జాబితాలో అరుదైన ఘనత సాధించిన దీపిక**
**గత 25 ఏళ్ల ఉత్తమ చిత్రాల్లో ఆమె నటించిన 10 సినిమాలకు చోటు**
**స్టార్ హీరోలను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచిన వైనం**
**ఎవరికీ తలవంచనంటూ వివాదాలపై పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు**

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణే చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల ఓ భారీ ప్రాజెక్టు నుంచి ఆమెను తప్పించిన నేపథ్యంలో, దీపిక పరోక్షంగా స్పందిస్తూ తన వ్యక్తిత్వాన్ని సూటిగా వెల్లడించారు. ప్రముఖ ఆన్‌లైన్ మూవీ డేటాబేస్ ఐఎమ్‌డీబీ (IMDb) '25 ఏళ్ల భారతీయ సినిమా' పేరుతో విడుదల చేసిన నివేదికలో దీపిక అరుదైన ఘనతను అందుకున్నారు. ఈ జాబితాలోని 130 ఉత్తమ చిత్రాలలో ఏకంగా 10 సినిమాలు దీపిక నటించినవే కావడం విశేషం. ఈ క్రమంలో అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, ప్రభాస్ వంటి అగ్ర తారలను కూడా ఆమె అధిగమించారు. ఈ రికార్డుపై ఆనందం వ్యక్తం చేసిన దీపిక, తన కెరీర్ ప్రయాణం గురించి మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేను ముక్కుసూటిగా వ్యవహరిస్తాను. నమ్మిన విలువల విషయంలో రాజీపడను. నాకు తప్పు అనిపిస్తే, ఎదుటివారు ఎంతటి వారినైనా సరే ప్రశ్నించడానికి వెనుకాడను. అది నా నైజం. అవసరమైతే కష్టమైన మార్గాన్ని ఎంచుకుంటానే తప్ప, ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదు" అని ఆమె స్పష్టం చేశారు.



# 'చౌదరి' గారి ఫస్ట్‌లుక్ విడుదల

ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ఫ్లస్ సంస్థ నిర్మించిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి'. కథానాయకుడు వినరుతేజ్, రిషిత కథానాయిక. సిద్ధార్థ వర్మ కాకాని దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమాలో చౌదరిగారుగా వీరంకి వెంకట నరసింహారావు కీలకపాత్రలో నటించారు. ఆయన పాత్రను తెలియజేసే పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339